సమగ్ర సమాచార పత్రిక

# ముద్ర

www.mudranews.in

హైదరాబాద్
శుక్రవారం, 07.08.2026

www.mudranews.in | @mudranews

సంపుటి:13 సంచిక: 276
పేజీలు: 08 వెల: రూ. 5

# ఫోకస్ ఎమ్మెల్సీ!

## కాంగ్రెస్, బీజేపీ పోటీ..బీఆర్ఎస్ వ్యూహంపై ఉత్కంఠ!

### టికెట్ రేసులో యువ నేతలు..ముందస్తు గ్రౌండ్ వర్క్ ప్రారంభం!

- ఫారం-18 నమోదే గెలుపు పునాది..
- పట్టభద్రుల ఓట్ల కోసం మూడు ప్రధాన పార్టీల ముమ్మర కసరత్తు!
- తీన్మార్ మల్లన్నతో పాటు పలువురు నేతలు పోటీకి సిద్ధం!
- అర్బన్ ఓటర్లపై గురి.. బీజేపీ, కాంగ్రెస్ దూకుడు!
- బలమైన అభ్యర్థి కోసం బీఆర్ఎస్ అన్వేషణ..
- పట్టభద్రుల తీర్పుతో ప్రభుత్వ పనితీరుపై క్లారిటీ రానుందా?
- ఓటర్ల నమోదు నుంచే అసలు పోరు



**ముద్ర డెస్క్ :**
తెలంగాణ రాజకీయాల్లో మరోసారి పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సందడి మొదలుకానుంది. హైదరాబాద్–రంగారెడ్డి–మహబూబ్‌నగర్, వరంగల్–ఖమ్మం–నల్గొండ గ్రాడ్యుయేట్ నియోజకవర్గాలకు చెందిన ఎమ్మెల్సీల పదవీకాలం 2027 మార్చితో ముగియనుండటంతో, కేంద్ర ఎన్నికల సంఘం మరో రెండు మూడు నెలల్లో కొత్త ఓటర్ల నమోదు ప్రక్రియను ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తోంది. ఎన్నికల షెడ్యూల్‌కు ఇంకా సమయం ఉన్నప్పటికీ ప్రధాన రాజకీయ పార్టీల్లో మాత్రం అభ్యర్థుల ఎంపిక, ఓటర్ల నమోదు వ్యూహాలపై చర్చలు ఊపందుకున్నాయి.
గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలు సాధారణ అసెంబ్లీ లేదా లోక్‌సభ ఎన్నికలకు భిన్నంగా జరుగుతాయి. ప్రతి ఆరేళ్లకు ఒకసారి పాత ఓటర్ల జాబితా రద్దు చేయబడుతుంది. కొత్తగా పట్టభద్రులు ఫారం–18 ద్వారా ఓటర్లుగా నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. ఈ కారణంగా ఎన్నికల్లో విజయం సాధించాలంటే ముందుగా ఎక్కువ సంఖ్యలో అనుకూల ఓటర్లను నమోదు చేయించుకోవడం అత్యంత కీలకం. అందుకే టికెట్ ఆశిస్తున్న నాయకులు ఇప్పటినుంచే డిగ్రీ కళాశాలలు, ఉద్యోగుల సంఘాలు, ఐటీ కంపెనీలు, యువజన వేదికలు, సోషల్ మీడియా ద్వారా ప్రచారాన్ని ప్రారంభించే దిశగా అడుగులు వేస్తున్నారు.
అధికార కాంగ్రెస్ పార్టీలో ఈసారి పోటీ తీవ్రంగా కనిపిస్తోంది. యువ నాయకుడు సామ రామ్మోహన్ రెడ్డి పోటీకి ఆసక్తి చూపుతుండగా, ప్రస్తుతం ఎమ్మెల్సీగా ఉన్న తీన్మార్ మల్లన్న కూడా మరోసారి బరిలోకి దిగేందుకు కసరత్తు ప్రారంభించారు. గత ఎన్నికల్లో ఏర్పరుచుకున్న ఓటు బ్యాంకును నిలబెట్టుకోవడంతో పాటు సోషల్ మీడియా నెట్‌వర్క్‌ను మరింత బలోపేతం చేసే ప్రయత్నాల్లో ఆయన నిమగ్నమయ్యారు. మరోవైపు కాంగ్రెస్‌లో మరికొందరు నేతలు కూడా ఈ స్థానంపై కన్నేశారని పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది.
భారతీయ జనతా పార్టీ ఈ ఎన్నికలను అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుంటోంది. పట్టభద్రులు, పట్టణ ప్రాంత విద్యావంతులు, ఉద్యోగుల్లో తమకు బలమైన మద్దతు ఉంటుందనే అంచనాతో బీజేపీ ముందుగానే కార్యాచరణ ప్రారంభించింది. హైదరాబాద్–రంగారెడ్డి–మహబూబ్‌నగర్ స్థానంలో గతంలో విజయం సాధించిన అనుభవాన్ని పునరావృతం చేయాలని కమలం పార్టీ భావిస్తోంది. సీనియర్ నాయకులతో పాటు యువ మోర్చా, విద్యార్థి సంఘాల నాయకులు టికెట్ కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. ఓటర్ల నమోదు ప్రారంభమయ్యే నాటికే అభ్యర్థిని ప్రకటించి ప్రచారాన్ని ప్రారంభించాలన్న వ్యూహంతో బీజేపీ ఉన్నట్లు తెలుస్తోంది. **మిగతా 02లో**

---

పోలవరం-బనకచర్లకు

# కేంద్రం షాక్

### పర్యావరణ ప్రతిపాదనలు వెనక్కి.. ప్రాజెక్టుకు తాత్కాలిక బ్రేక్

- అంతర్రాష్ట్ర వివాదాలు, చట్టపరమైన అభ్యంతరాలే కారణం
- శాస్త్రీయ అధ్యయనం తర్వాతే మళ్లీ దరఖాస్తు చేయాలని కేంద్ర సూచన
- తెలంగాణ, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల ప్రయోజనాలకు ముప్పు అని నిర్ధారణ
- ఏపీ ప్రభుత్వానికి కోలుకోలేని దెబ్బ

**ముద్ర, అమరావతి :**
ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన పోలవరం–బనకచర్ల నదుల అనుసంధాన ప్రాజెక్టుకు కేంద్రం ఊహించని షాక్ ఇచ్చింది. రూ.81,900 కోట్ల అంచనా వ్యయంతో గోదావరి జలాలను పెన్నా బేసిన్‌కు మళ్లించే ఈ భారీ ప్రాజెక్టుకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం సమర్పించిన పర్యావరణ అనుమతుల ప్రతిపాదనలను కేంద్ర పర్యావరణ, అటవీ మంత్రిత్వ శాఖ పరిధిలోని నిపుణుల అంచనాల కమిటీ (EAC) వెనక్కి పంపింది. దీంతో ప్రాజెక్టు ప్రారంభ దశలోనే కీలక అడ్డంకి ఎదురైంది.

**చట్టపరమైన చిక్కులే కారణం**

ప్రాజెక్టు ప్రతిపాదనలను పరిశీలించిన ఈఏసీ, 1980 గోదావరి జల వివాదాల ట్రిబ్యునల్ తీర్పు, అంతర్రాష్ట్ర జల హక్కులు, పర్యావరణ ప్రభావాలపై వచ్చిన అభ్యంతరాలను ప్రధానంగా పరిగణనలోకి తీసుకుంది. గోదావరి వరద జలాల మళ్లింపు వల్ల తెలంగాణతో పాటు ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల ప్రయోజనాలు దెబ్బతినే అవకాశం ఉందన్న వాదనల నేపథ్యంలో ప్రస్తుత రూపకల్పనపై మరింత సమగ్ర పరిశీలన అవసరమని స్పష్టం చేసింది.

**శాస్త్రీయ అధ్యయనం తప్పనిసరి**

గోదావరి బేసిన్‌లో వాస్తవంగా అందుబాటులో ఉన్న మిగులు వరద జలాలపై కేంద్ర జల సంఘం (CWC) ద్వారా శాస్త్రీయ అధ్యయనం నిర్వహించాలని కమిటీ సూచించింది. పూర్తి సాంకేతిక నివేదిక సిద్ధమైన తర్వాత, పొరుగు రాష్ట్రాలతో ఉన్న జల వివాదాలను సంప్రదింపులు లేదా **మిగతా 02లో**



---

## 20 నెలల్లో 150 జీసీసీలు

### 1.5 లక్షల ఉద్యోగాలు

- హైదరాబాద్‌లో జేఎల్ఎల్ జీసీసీ ప్రారంభించిన శ్రీధర్ బాబు
- జీసీసీలకు తెలంగాణ హబ్.. పెట్టుబడులకు కొత్త ఊపు
- కొత్త జేఎల్ఎల్ కేంద్రంతో మరో 1,600 ఉద్యోగాల అవకాశం
- జాతీయ జీసీసీ లీజింగ్‌లో హైదరాబాద్‌కు 16% వాటా

03



---

## జాతీయ భద్రతపై మోడీ

# సంచలనం..

### విదేశీ నిధులపై కేంద్రం కఠిన నిబంధనలు

- ఎఫ్‌సీఆర్ఏ సవరణ బిల్లుపై దేశవ్యాప్తంగా చర్చ!
- ఎన్జీఓలు, మిషనరీల్లో ఆందోళన
- కేంద్రం పారదర్శకతే లక్ష్యమంటోంది!
- ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా వెనక ఎఫ్‌సీఆర్ఏ బిల్లు చర్చ!
- భద్రతా పరిరక్షణా? స్వేచ్ఛపై ఆంక్షలా?
- ఎఫ్‌సీఆర్ఏపై భిన్నాభిప్రాయాలు..!




**ముద్ర, డెస్క్:**
కేంద్ర ప్రభుత్వం తీసుకురానున్న విదేశీ విరాళాల నియంత్రణ చట్టం (FCRA) సవరణ బిల్లు–2026 దేశవ్యాప్తంగా తీవ్ర చర్చకు దారితీసింది. ఒకవైపు విదేశీ నిధుల వినియోగంలో పారదర్శకత, జాతీయ భద్రతను బలోపేతం చేసే సంస్కరణగా ప్రభుత్వం దీనిని సమర్థిస్తుండగా, మరోవైపు పౌర సమాజ సంస్థలు, మతపరమైన సంస్థలు, ప్రతిపక్షాలు ఈ బిల్లుపై తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నాయి. ఈ బిల్లుపై చర్చ జరుగుతున్న సమయంలోనే కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా రాజకీయ వర్గాల్లో కొత్త చర్చకు తెరతీసింది. అధికారికంగా ఆయన రాజీనామాకు కారణం నీట్ పరీక్షల వివాదమే **మిగతా 02లో**

---

## కేసీఆర్‌ను నమ్మిన వ్యక్తి జయశంకర్

### కేసీఆర్‌కు మించి మొండితనం ఉన్న నాయకుడు

- తెలంగాణ ఆత్మగౌరవానికి ప్రతీక
- తెలంగాణ భవన్ లో ఘనంగా జయంతి వేడుకలు
- జీవితాంతం అంకితభావంతో పోరాడారన్న కేటీఆర్
- విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించిన బీఆర్ఎస్ నేతలు

02



---

## రేప్ కేసులో తెహల్కా తేజ్ పాల్ దోషి

### గోవా లైంగిక దాడి కేసులో దోషిగా తేజ్‌పాల్‌ను తేల్చిన హైకోర్టు

- 'నో అంటే నో'.. ట్రయల్ కోర్టు తీర్పును కొట్టివేసిన హైకోర్టు
- 2013 కేసులో సంచలన మలుపు.. తేజ్‌పాల్‌కు ఎదురుదెబ్బ
- మహిళల భద్రత కేసుల్లో కీలక సందేశంగా హైకోర్టు తీర్పు

02



---

## తెలంగాణ విద్యుత్ భద్రత

### సింగరేణి చారిత్రక ముందడుగు

- ఒడిశా నైనీ నుంచి తొలి బొగ్గు రైల్వే రేక్ రాక!
- ఫలించిన డిప్యూటీ సీఎం భట్టి అలుపెరగని కృషి
- 1,131 కి.మీ. ప్రయాణించి థర్మల్ కేంద్రానికి చేరిన తొలి బొగ్గు రేకు
- 59 వ్యాగన్లలో 4 వేల టన్నుల జీ10 గ్రేడ్ బొగ్గు రాక
- ప్రజా ప్రభుత్వ చొరవతో కార్యరూపం దాల్చిన ప్రాజెక్టు

02



---

## 15 నుంచి కొత్త రేషన్ కార్డులు

- 1.05 కోట్ల లామినేటెడ్ పీడీఎస్ కార్డులు
- పంపిణీకి ప్రభుత్వం సిద్ధం..
- సంగారెడ్డిలో సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభం

02

---

ఇదీ AI ముద్ర



సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
శుక్రవారం 07.08.2026
www.mudranews.in | @mudranews



## చన్నీటి స్నానం.. సహజ డోపమైన్‌కు దారి



ఉదయాన్నే చన్నీటి స్నానం చేయడం రక్తప్రసరణను మెరుగుపరచి శరీరానికి చురుకుదనాన్ని అందిస్తుంది. అలసటను తగ్గించి మెదడును చైతన్యవంతం చేయడంలో ఇది సహాయపడుతుంది.

# ఫోకస్ ఎమ్మెల్సీ

**(మొదటి పేజీ తరువాయి)**

మరోవైపు బీఆర్ఎస్‌లో మాత్రం ఇప్పటి వరకు పెద్దగా ఎన్నికల హడావిడి కనిపించడం లేదు. శాసనసభ, లోక్‌సభ ఎన్నికల అనంతరం ఎదురైన రాజకీయ సవాళ్ల మధ్య పట్టభద్రుల వర్గంలో తిరిగి పట్టు సాధించడం ఆ పార్టీకి కీలకంగా మారింది. అర్బన్ ఓటర్లలో పార్టీ ప్రభావాన్ని నిలబెట్టుకోవాలంటే ఈ ఎన్నికల్లో బలమైన పోటీ ఇవ్వాల్సిందేనని గులాబీ పార్టీ భావిస్తోంది. అయితే కాంగ్రెస్, బీజేపీతో సమానంగా ఓటర్ల నమోదు కార్యక్రమాన్ని నిర్వహించగలిగే ఆర్థిక, సంస్థాగత బలం కలిగిన అభ్యర్థిని ఎంపిక చేయడం బీఆర్ఎస్‌కు ప్రధాన సవాల్‌గా మారింది.

ఇప్పటికే వాట్సాప్ గ్రూపులు, యూట్యూబ్ ఛానెల్లు, ఫేస్‌బుక్ కమ్యూనిటీలు, ఐటీ ఉద్యోగుల వేదికల్లో ఓటర్ల నమోదు అవగాహన కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. నిరుద్యోగ భృతి, జాబ్ క్యాలెండర్, ప్రభుత్వ ఉద్యోగుల పీఆర్సీ, పెన్షన్ సవరణలు, ఉపాధి అవకాశాలు వంటి అంశాలు ఈ ఎన్నికల్లో ప్రధాన చర్చగా మారే అవకాశాలు కనిపిస్తున్నాయి. ముఖ్యంగా ప్రభుత్వ ఉద్యోగులు, ప్రైవేట్ రంగ ఉద్యోగులు, నిరుద్యోగ పట్టభద్రుల అభిప్రాయమే ఎన్నికల ఫలితాలను ప్రభావితం చేసే అంశంగా విశ్లేషకులు భావిస్తున్నారు.

రాబోయే గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలు కేవలం ఇద్దరు సభ్యుల ఎన్నికతో పరిమితం కావు. రేవంత్ రెడ్డి ప్రభుత్వ పనితీరుపై పట్టభద్రుల అభిప్రాయానికి ఇవి ఒక సూచికగా నిలవనున్నాయి. అదే సమయంలో పట్టణ ప్రాంతాల్లో బీజేపీ బలాన్ని పరీక్షించడంతో పాటు, బీఆర్ఎస్ తిరిగి పుంజుకునే అవకాశాలను కూడా ఈ ఎన్నికలు నిర్ధారించనున్నాయి. అందువల్ల ఓటర్ల నమోదు దశ నుంచే వ్యూహాత్మకంగా పనిచేసి, సరైన సమయంలో బలమైన అభ్యర్థులను రంగంలోకి దించే పార్టీకి విజయావకాశాలు ఎక్కువగా ఉండే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

# జాతీయ భద్రతపై సంచలనం..

**(మొదటి పేజీ తరువాయి)**

అయినప్పటికీ, పార్లమెంట్‌లో కీలక బిల్లుల ఆమోదానికి ముందుగా రాజకీయ ఉద్రిక్తతలను తగ్గించే వ్యూహంలో భాగమేనన్న వాదనలు కూడా వినిపిస్తున్నాయి. అయితే, దీనిపై ప్రభుత్వం నుంచి అధికారిక ధృవీకరణ లేదు. ఎఫ్‌ఆర్‌సీఏ చట్టం ఉద్దేశం విదేశాల నుంచి వచ్చే నిధులు ప్రకటించిన లక్ష్యాలకే వినియోగించబడుతున్నాయా లేదా అనే అంశంపై కట్టుదిట్టమైన పర్యవేక్షణ ఏర్పాటు చేయడం. దేశ భద్రత, ప్రజాప్రయోజనాలు, రాజకీయ వ్యవస్థలకు విరుద్ధంగా విదేశీ నిధులు వినియోగించకుండా చూడటమే ప్రధాన లక్ష్యమని కేంద్రం చెబుతోంది. ప్రతి రూపాయి ఖర్చుకు జవాబుదారీతనం ఉండాలని, నిబంధనలు ఉల్లంఘించిన సంస్థలపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ బిల్లులోని కొన్ని ప్రతిపాదనలు ఆందోళనలకు కూడా కారణమవుతున్నాయి. ముఖ్యంగా ఎఫ్‌ఆర్‌సీఏ రిజిస్ట్రేషన్ రద్దయిన లేదా గడువు ముగిసిన సంస్థల విదేశీ నిధులు, ఆస్తులపై ప్రభుత్వం నియంత్రణ చేపట్టే అవకాశంపై ఎన్జీఓలు ప్రశ్నలు లేవనెత్తుతున్నాయి. ప్రభుత్వ అధికారాలు మరింత విస్తరించే అవకాశం ఉందని, స్వచ్ఛంద సంస్థల స్వతంత్రత దెబ్బతినవచ్చని వారు అభిప్రాయపడుతున్నారు.

ఈ అంశం దేశ సరిహద్దులను దాటి అంతర్జాతీయ దృష్టిని కూడా ఆకర్షించింది. అమెరికాలోని కొన్ని మత స్వేచ్ఛ సంస్థలు, రాజకీయ నాయకులు ఈ బిల్లుపై ఆందోళన వ్యక్తం చేస్తూ తమ అభిప్రాయాలను వెల్లడించారు. అయితే, భారత ప్రభుత్వం మాత్రం దేశ చట్టాలు, దేశ ప్రయోజనాల దృష్ట్యా తీసుకునే నిర్ణయాలు పూర్తిగా అంతర్గత వ్యవహారమని స్పష్టం చేస్తోంది.

ఈ నేపథ్యంలో అసలు ప్రశ్న ఒక్కటే. విదేశీ నిధులపై పారదర్శకతను పెంచడం అవసరమే. అదే సమయంలో సమాజ సేవ చేస్తున్న సంస్థల పనితీరుకు అనవసర ఆటంకాలు ఏర్పడకూడదు. భద్రత పేరుతో అధిక నియంత్రణ, స్వేచ్ఛ పేరుతో పూర్తి నిర్లక్ష్యం– ఈ రెండు అంచుల మధ్య సమతుల్యత సాధించడమే సవాలు.

పార్లమెంట్‌లో జరిగే చర్చలు, అవసరమైన సవరణలు, అన్ని వర్గాల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవడం ద్వారా ఈ బిల్లు మరింత సమగ్రమైతేనే ప్రజల విశ్వాసాన్ని గెలుచుకోగలదు. ప్రజాస్వామ్యంలో చట్టాల బలం కేవలం కఠిన నిబంధనల్లో కాదు; పారదర్శకత, న్యాయబద్ధత, సమతుల్య దృక్పథంలో ఉంటుంది. ఎఫ్‌ఆర్‌సీఏ సవరణ బిల్లు కూడా అదే ప్రమాణాలపై పరీక్షించబడాల్సిన అవసరం ఉంది.




## పోలవరం-బనకచర్లకు
# కేంద్రం షాక్




**(మొదటి పేజీ తరువాయి)**

చట్టబద్ధ వేదికల ద్వారా పరిష్కరించుకుని, అనంతరం పర్యావరణ అనుమతుల కోసం తిరిగి దరఖాస్తు చేయాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది.

**ఏపీ ఆశయాలు భారీగానే**

సముద్రంలో వృథాగా కలిసిపోతున్న గోదావరి వరద నీటిలో 200 టీఎంసీలను రాయలసీమతో పాటు ఉమ్మడి ప్రకాశం, నెల్లూరు జిల్లాల కరవు ప్రాంతాలకు మళ్లించడమే ఈ ప్రాజెక్టు ప్రధాన లక్ష్యం. దీని ద్వారా సుమారు 80 లక్షల మందికి తాగునీరు, 7.41 లక్షల ఎకరాలకు కొత్త సాగునీరు, అలాగే 9.14 లక్షల హెక్టార్ల ఆయకట్టు స్థిరీకరణ సాధ్యమవుతుందని రాష్ట్ర ప్రభుత్వం అంచనా వేస్తోంది.

**తాత్కాలికంగా ప్రాజెక్టుకు బ్రేక్**

కేంద్రం తాజా నిర్ణయంతో పోలవరం–బనకచర్ల ప్రాజెక్టు పనులకు తాత్కాలికంగా బ్రేక్ పడినప్పటికీ, ప్రాజెక్టును నిలిపివేయాలన్న ఉద్దేశం లేదని అధికార వర్గాలు స్పష్టం చేస్తున్నాయి. సీడబ్ల్యూసీతో కలిసి వరద జలాల లభ్యతపై పూర్తి గణాంకాలు సిద్ధం చేయడం, అంతర్రాష్ట్ర అభ్యంతరాలకు న్యాయపరమైన సమాధానాలు ఇవ్వడం ద్వారా ప్రాజెక్టుకు మళ్లీ పర్యావరణ అనుమతులు పొందేందుకు జలవనరుల శాఖ వేగంగా చర్యలు చేపడుతోంది. కేంద్రం సూచించిన అంశాలను పూర్తి చేసిన తర్వాతే ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టు తదుపరి దశకు వెళ్లే అవకాశం కనిపిస్తోంది.



# తెలంగాణ విద్యుత్ భద్రత

**ముద్ర , హైదరాబాద్ :**

సింగరేణి కొల్లరీస్ కంపెనీ లిమిటెడ్ చరిత్రలో మరో మైలురాయిని నమోదు చేసుకుంది. ఒడిశాలో నైనీ బొగ్గు బ్లాక్ నుంచి బయలుదేరిన తొలి బొగ్గు రైల్వే రేక్ మంచిర్యాల జిల్లా జైపూర్ సింగరేణి థర్మల్ విద్యుత్ కేంద్రం (STPP) కి విజయవంతంగా చేరుకుంది.

ఇది తెలంగాణ రాష్ట్ర భద్రతలో చరిత్రాత్మక ఘట్టంగా నిలిచింది. ఈ తొలి రేక్ లో 59 బాక్స్ వ్యాగన్లు ఉన్నాయి. వీటిలో సుమారు 4 వేలు టన్నుల అత్యుత్తమ జీ–10 గ్రేడ్ బొగ్గు ఉంది. ఒడిశా నుంచి 1131 కిలోమీటర్ల దూరం ప్రయాణించి జైపూర్ STPPకి చేరుకుంది. ఈ సందర్భంగా సింగరేణి డైరెక్టర్లు ఎల్.వి.సూర్యనారాయణ, ఎం.తిరుమల రావు రేక్ కు ఘన స్వాగతం పలికారు. ప్రత్యేక పూజలు నిర్వహించి అన్ లోడింగ్ ప్రక్రియ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో STPP ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, జనరల్ మేనేజర్, గుర్తింపు పొందిన , ప్రాతినిధ్య కార్మిక సంఘాల నాయకులు, అధికార సంఘ ప్రతినిధులు, ఉద్యోగులు, కార్మికులు పాల్గొన్నారు. ఈ చారిత్రాత్మక ఘట్టం సందర్భంగా సింగరేణి యాజమాన్యానికి అధికారులకు, ఉద్యోగులకు శుభాకాంక్షలు తెలియజేశారు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు.

సింగరేణి థర్మల్ పవర్ ప్రాజెక్ట్ కోసం కేటాయించిన నైనీ బొగ్గు బ్లాక్ నుంచి తొలి రైల్ రేక్ రావడం మనందరికీ గర్వకారణం అన్నారు మల్లు భట్టి విక్రమార్క. సింగరేణి చరిత్రలో ఇది చారిత్రక ఘట్టం అన్నారు. తెలంగాణ విద్యుత్ అవసరాలు తీర్చడంలో, రాష్ట్ర అభివృద్ధిలో సింగరేణి పాత్ర ఎనలేనిది అని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం సింగరేణిని మరింత బలోపేతం చేస్తూ, ప్రపంచ స్థాయి సంస్థగా తీర్చిదిద్దే లక్ష్యంతో ముందుకు సాగుతోందని స్పష్టం చేశారు.

నైనీ బొగ్గు బ్లాక్ ను 2015లో కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ సింగరేణికి కేటాయించింది. దాదాపు తొమ్మిదేళ్లు నిలిచిపోయిన ఈ ప్రాజెక్టును ప్రస్తుత ప్రభుత్వం వేగవంతం చేసింది. 2025 ఏప్రిల్ 16న నైనీ గనిలో బొగ్గు ఉత్పత్తి అధికారికంగా ప్రారంభమైంది. ఈ బ్లాక్‌లో 340.78 మిలియన్ టన్నుల బొగ్గు నిల్వలు ఉన్నాయి. ఏడాదికి కోటి టన్నుల ఉత్పత్తి సామర్థ్యం, 36ఏళ్ల గని జీవితకాలం ఉంది. నాణ్యమైన జీ 10 గ్రేడ్ బొగ్గు STPPకి నిరంతర సరఫరా అందించడంలో రాష్ట్ర విద్యుత్ ఉత్పత్తికి దీర్ఘకాలిక స్థిరత్వం లభించనుంది. సింగరేణి అధికారులు ఈ విజయాన్ని సంస్థ విస్తరణలో కొత్త అధ్యాయంగా అభివర్ణించారు. ఇతర రాష్ట్రాల్లో మైనింగ్ కార్యకలాపాలు ప్రారంభించడం ద్వారా జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఎదరగడానికి ఇది మొదటి అడుగు అని పేర్కొన్నారు. నైనీ బొగ్గు సరఫరాతో STPP ఇందన భద్రత పెరగడమే కాకుండా, రాష్ట్ర విద్యుత్ రంగం మరింత బలపడనుంది. ఈ చారిత్రక ఘట్టం సింగరేణి ఉద్యోగులు, కార్మికుల కృషికి నిదర్శనం. తెలంగాణ ప్రభుత్వం, సింగరేణి యాజమాన్యం సమన్వయంతో మరిన్ని అభివృద్ధి పథకాలు ముందుకు సాగనున్నాయని అన్నారు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు.

## రూ.1,000 కోట్ల క్యాంటమ్ వ్యాలీకి
# గ్రీన్ సిగ్నల్

### దిశా, ల్యాండ్ గ్రాబింగ్ బిల్లులకు గుడ్‌బై

**మున్సిపల్ భూముల లీజు గడువు పెంపునకు చట్టసవరణల ప్రతిపాదన**

- **యూడీఏల పునర్వ్యవస్థీకరణ**
- **రెండు కొత్త ప్రైవేట్ యూనివర్సిటీల ఏర్పాటు,**
- **కొత్త జిల్లాలకు 15 కొత్త డీఈవో పోస్టులు**
- **ఏపీ కేబినెట్‌లో కీలక నిర్ణయాలు..**
- **ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్-2026, పీపీపీ పాలసీకి ఆమోదం**



**ముద్ర, అమరావతి:**

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన అమరావతి సచివాలయంలో జరిగిన ఆంధ్రప్రదేశ్ మంత్రివర్గ సమావేశంలో రాష్ట్ర అభివృద్ధికి దిశానిర్దేశం చేసే పలు కీలక నిర్ణయాలకు ఆమోదం లభించింది. పారిశ్రామిక పెట్టుబడులను ఆకర్షించే లక్ష్యంతో ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ యాక్ట్–2026, ఏపీ పీపీపీ పాలసీ–2026 ముసాయిదాలకు కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. మహిళల భద్రత, భూ హక్కుల పరిరక్షణకు మరింత పటిష్ఠమైన చట్టాలు తీసుకురావాలనే ఉద్దేశంతో గత ప్రభుత్వం తీసుకొచ్చిన దిశా బిల్లు–2019, ల్యాండ్ గ్రాబింగ్ బిల్లు–2024 ను ఉపసంహరించాలని నిర్ణయించింది. రాజధాని అమరావతిని ప్రపంచ స్థాయి టెక్నాలజీ హబ్‌గా తీర్చిదిద్దే లక్ష్యంతో క్వాంటమ్ వ్యాలీ ట్విన్ టవర్స్ నిర్మాణానికి రూ.1,002.49 కోట్లు మంజూరు చేసింది. నిర్మాణ బాధ్యతలను ఎల్అండ్‌టీకి అప్పగించేందుకు ఆమోదం తెలిపింది. అలాగే అమరావతి వన్ రీ–టెండర్లు, హైకోర్టు భవనాల విస్తరణ, అనుబంధ మౌలిక వసతుల కోసం రూ.206 కోట్లు కేటాయించేందుకు అంగీకరించింది.

గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు ఊతమిచ్చేలా ఆక్వా రైతులకు రాయితీ విద్యుత్ టారిఫ్‌ను పొడిగించింది. కుప్పం ఎయిర్‌పోర్ట్ కోసం భూమిలిచ్చిన రైతులకు ఎకరాకు రూ.12.44 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించేందుకు ఆమోదం తెలిపింది. రానున్న గోదావరి పుష్కరాలు దృష్ట్యా పుష్కర ఘాట్ల ఆధునీకరణకు రూ.210 కోట్ల ప్రాథమిక ఆమోదం లభించింది.

అదే సమయంలో అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీల పునర్వ్యవస్థీకరణ, మున్సిపల్ భూముల లీజు గడువు పెంపు చట్ట సవరణలు, పాదచారుల భద్రత పాలసీ–2026 అమలుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. నిలిచిపోయిన ప్రాజెక్టులను రీ–టెండర్ల ద్వారా వేగవంతం చేయడం, బాధితులకు త్వరితగతిన ఎక్స్‌గ్రేషియా చెల్లించడం, వివాదాస్పద పాత చట్టాల స్థానంలో రాజ్యాంగబద్ధమైన కొత్త చట్టాలు తీసుకురావడం ఈ కేబినెట్ సమావేశం ప్రధాన విశేషాలుగా నిలిచాయి.

## కేసీఆర్ ను నమ్మిన ఒకేఒక వ్యక్తి జయశంకర్ సార్

**ముద్ర, హైదరాబాద్ :**

తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ సార్ జయంతి సందర్భంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ గురువారం తెలంగాణ భవన్‌లో ఆయన విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. ఎందుకు మీరు కేసీఆర్‌ను అంత నమ్ముతరని చాలా మంది జయశంకర్‌సార్‌ను అడిగేది. ఆయన ఎప్పుడూ అనేది ఒక మాట అనేవారు.. కేసీఆర్‌కు మించి దక్షత, కమిట్‌మెంట్, తెలంగాణ సాధించాలనే మొండితనం ఉన్న నాయకుడిని ఒక్కరిని చూపించండి.. నేను మీ వెంబడి నడుస్తా అని అనేవారు. ఆయన మోహమాటం కూడా పడేది కాదన్నారు.




దేవేందర్ గౌడ్ పార్టీ పెడితే వెళ్లి మీరు పోవొద్దు సార్ కేసీఆర్‌తో అసోసియేట్ అయి ఉన్నరని అంటే జయశంకర్ సార్ ఒక మాట చెప్పిం డు.. ఎన్ని పార్టీలు వస్తే అంత మంచిది ఏం కాదు.. తెలంగాణ రాష్ట్రం రావాలే.. ఆ రాష్ట్రం వచ్చే క్రమంలో నేను వాళ్లకు తెలంగాణ కోసం స్పర్థ లేకుండా, సమాంతరంగా పనిచేయండి.. ఒకరికి ఒకరు కలహించుకోకండి.. ఎవరు చేసిన అల్టిమేట్‌గా మీరందరూ కోరుతున్నది తెలంగాణే కదా..చెప్పి వస్తనన్నారు. తెలంగాణ ఉద్యమం సమయంలో ఎన్ని కొత్త పార్టీలు పుట్టినా, వారికి తాత్కాలిక భావసారూప్యత లేకపోయినా, లక్ష్యసారూప్యత ఉండాలని బలంగా వాదిం చిన గొప్ప వ్యక్తి ప్రొఫెసర్ జయశంకర్ సార్ అని కేటీఆర్ అన్నారు.

తెలంగాణలో మళ్లీ నీళ్లకు అన్యాయం చేసే ప్రయత్నం జరుగుతుందని హరీష్ రావు ప్రెస్‌మీట్ పెట్టారని కేటీఆర్ తెలిపారు. తెలంగాణకు సంబంధించిన 7 ప్రాజెక్టులను రద్దు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఏపీ ప్రభుత్వం అడుగుతుంది. ఢిల్లీ పార్టీ చేతుల్లో జుట్టు ఉంటే వాళ్లు ఆడించినట్లే ఆడాలి. అదే తెలంగాణ కోసం పుట్టిన పార్టీ అధికారంలో ఉంటే ఆ పరిస్థితి ఉంటుందా..? అని కేటీఆర్ అడిగారు. లోక్‌సభలో తెలంగాణ విభజనను పాకిస్తాన్‌తో పోలిస్తే ఒక్క బీజేపీ, కాంగ్రెస్ ఎంపీ అయినా మాట్లాడిండా..? అదే మనవాడు ఉంటే గల్లా పట్టి అడిగేవాడని అన్నారు.

# 15 నుంచి కొత్త రేషన్ కార్డులు




**ముద్ర, హైదరాబాద్ :**

తెలంగాణలో కొత్త రేషన్ కార్డుల కోసం ఎదురుచూస్తున్న పేద, మధ్యతరగతి కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త తెలిపింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఆగస్టు 15 నుంచి కొత్త పీడీఎస్ (పబ్లిక్ డిస్ట్రిబ్యూషన్ సిస్టమ్) రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించనుంది. సంగారెడ్డి జిల్లా కేంద్రంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారికంగా కొత్త రేషన్ కార్డుల పంపిణీకి శ్రీకారం చుట్టనున్నారు. అనంతరం రాష్ట్రంలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఒకేసారి కొత్త రేషన్ కార్డుల పంపిణీ చేపట్టేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు పూర్తి చేస్తోంది. తెలంగాణ వ్యాప్తంగా సుమారు 1.05 కోట్ల కుటుంబాలకు పీవీసీ రేషన్ కార్డులు పంపిణీ తేదీ ఖరారైన నేపథ్యంలో సంబంధిత శాఖల అధికారులకు ప్రభుత్వం కీలక ఆదేశాలు జారీ చేసింది.అర్హులైన ప్రతి కుటుంబానికి రేషన్ కార్డు అందేలా తుది లబ్ధిదారుల జాబితాల ధృవీకరణతో పాటు ఈ–కేవైసీ ప్రక్రియను వేగంగా పూర్తి చేయాలని సూచించింది. రేషన్ కార్డుల ముద్రణ నుంచి జిల్లాలకు తరలింపు వరకు ఎలాంటి అవాంతరాలు లేకుండా సురక్షిత రవాణా చర్యలు చేపట్టాలని పౌరసరఫరాల శాఖ అధికారులను ఆదేశించింది.

అలాగే జిల్లా కలెక్టర్లు స్థానిక ప్రజాప్రతినిధులతో సమన్వయం చేసుకుని పంపిణీ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ విడతలో తెలంగాణ వ్యాప్తంగా సుమారు 1.05 కోట్ల కుటుంబాలకు కొత్త తరహా లామినేటెడ్ (పీవీసీ) రేషన్ కార్డులను అందజేయనున్నారు. లబ్ధిదారునికి స్మార్ట్ కార్డు రూపంలో రేషన్ కార్డు అందించేందుకు ప్రభుత్వం కార్యాచరణ వేగవంతం వాటర్‌ప్రూఫ్ సౌకర్యంతో, క్రెడిట్ కార్డు పరిమాణంలో రూపొందించిన ఈ స్మార్ట్ కార్డులో క్యూఆర్ కోడ్‌తో పాటు ఆధునిక భద్రతా ఫీచర్లను కూడా పొందుపరిచారు. రాష్ట్రవ్యాప్తంగా కొత్త రేషన్ కార్డుల కోసం లక్షలాది మంది ఇప్పటికే దరఖాస్తు చేసుకున్న నేపథ్యంలో ప్రభుత్వం తీసుకున్న తాజా నిర్ణయం వారికి ఊరటనిచ్చేలా మారింది.అర్హులైన ప్రతి లబ్ధిదారునికి స్మార్ట్ కార్డు రూపంలో రేషన్ కార్డు అందించేందుకు ప్రభుత్వం కార్యాచరణను వేగవంతం చేసింది. అంతే కాకుండా కొత్త రేషన్ కార్డుల పంపిణీ పూర్తైన అనంతరం జిల్లా వారీగా సమగ్ర నివేదికలను సిద్ధం చేసి ప్రభుత్వానికి సమర్పించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇప్పటికే ఉన్నతాధికారులను ఆదేశించినట్లు అధికార వర్గాలు తెలిపాయి.

## రేప్ కేసులో తెహల్కా తేజ్ పాల్ దోషి

**ముద్ర, ఢిల్లీ:**

ప్రముఖ జర్నలిస్టు, 'తెహల్కా' మాజీ ఎడిటర్ తరుణ్ తేజ్‌పాల్‌కు గోవా లైంగిక దాడి కేసులో భారీ ఎదురుదెబ్బ తగిలింది. 2021లో ట్రయల్ కోర్టు ఇచ్చిన నిర్దోషిత్వ తీర్పును బాంబే హైకోర్టు గోవా బెంచ్ రద్దు చేస్తూ, జూనియర్ మహిళా సహోద్యోగిపై లైంగిక దాడి కేసులో ఆయనను దోషిగా నిర్ధారించింది. 2013లో గోవాలో జరిగిన 'థింక్‌ఫెస్ట్' సందర్భంగా ఓ మహిళా జర్నలిస్ట్ చేసిన ఫిర్యాదుతో కేసు నమోదైంది. ట్రయల్ కోర్టు తీర్పులో తీవ్ర లోపాలు ఉన్నాయని పేర్కొన్న హైకోర్టు, "ఒక మహిళ 'నో' అంటే అది 'నో' మాత్ర మే" అని స్పష్టం చేసింది. బాధితురాలు ఎలా ప్రవర్తించాలనే ముంద స్తు అభిప్రాయాలతో తీర్పు ఇవ్వడం సరైంది కాదని వ్యాఖ్యానించింది. తీర్పు అనంతరం తేజ్‌పాల్‌ను కస్టడీలోకి తీసుకోవాలని ప్రభుత్వం కోరగా, సుప్రీంకోర్టులో అప్పీల్ చేసుకునేందుకు సమయం ఇవ్వాలని తేజ్‌పాల్ కోర్టును అభ్యర్థించారు. ఈ తీర్పు మహిళలపై లైంగిక వేధింపుల కేసుల విచారణలో కీలక మైలురాయిగా భావిస్తున్నారు

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
శుక్రవారం 07.08.2026
www.mudranews.in | @mudranews



## రోజూ 10 నిమిషాలు నిశ్శబ్దంగా ఉండండి

రోజులో కనీసం పది నిమిషాలు కళ్లు మూసుకుని ప్రశాంతంగా కూర్చోవడం మానసిక ఒత్తిడిని తగ్గిస్తుంది. ఏకాగ్రత, ఆత్మవిశ్వాసం పెరగడానికి ఇది ఉపయోగపడుతుందని నిపుణులు సూచిస్తున్నారు.



# సామాజిక న్యాయ తెలంగాణ కోసం జీవితాన్ని అంకితం చేస్తున్నా

**- కల్వకుంట్ల కవిత**

**- బీసీ రిజర్వేషన్ బిల్లు వచ్చే బడ్జెట్ సమావేశాల్లోనే ఆమోదించాలి.. లేదంటే 'ఛలో ఢిల్లీ' ఉద్యమం**



**ముద్ర, హైదరాబాద్ :** సామాజిక న్యాయ తెలంగాణ సాధన కోసం తన జీవితాన్ని అంకితం చేస్తున్నట్లు తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత ప్రకటించారు. సమాజంలోని అట్టడుగు, అణగారిన వర్గాలకు రాజకీయ, సామాజిక, ఆర్థిక న్యాయం అందే వరకు తన పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. తెలంగాణ రక్షణ సేన ఆధ్వర్యంలో సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన 'సామాజిక న్యాయ తెలంగాణ సంకల్ప సభ'లో ఆమె కీలక ప్రసంగం చేశారు. కులం, మతం, వర్గాలకు అతీతంగా సామాజిక న్యాయం కోసం పోరాటం చేయాలంటే ధైర్యం, నిబద్ధత అవసరమని కవిత పేర్కొన్నారు. "నేను బీసీల కోసం మాట్లాడితే అగ్రకులంలో పుట్టిన నీకెందుకని కొందరు ప్రశ్నిస్తున్నారు. నా పుట్టుక నా చేతిలో లేదు. కానీ నేను ఎవరి కోసం పనిచేయాలో నిర్ణయించుకోవడం మాత్రం నా చేతుల్లోనే ఉంది" అంటూ వ్యాఖ్యానించారు. సమాజంలోని అన్ని వర్గాలకు సమాన అవకాశాలు కల్పించడమే తన లక్ష్యమని చెప్పారు.

**కోట్లాది జీవితాల్లో మార్పు తీసుకొచ్చే ఉద్యమం**

ఈ సామాజిక న్యాయ సంకల్ప సభ తెలంగాణ రాజకీయాల్లో కీలక మలుపు అవుతుందని, కోట్లాది మంది జీవితాల్లో మార్పు తీసుకువస్తుందని కవిత అన్నారు. గ్రామ గ్రామాన సామాజిక న్యాయం కోసం పార్టీ శ్రేణులు ఉద్యమిస్తాయని, వచ్చే ఐదు నెలల పాటు రాష్ట్రవ్యాప్తంగా సభలు, సమావేశాలు నిర్వహించి ప్రజల్లో చైతన్యం తీసుకువెళ్తామని వెల్లడించారు.

**ప్రొఫెసర్ జయశంకర్ కలల సామాజిక తెలంగాణ**

తెలంగాణ ఉద్యమ స్ఫూర్తిదాత ప్రొఫెసర్ జయశంకర్ ఆశయాలను నెరవేర్చడమే తన సంకల్పమని కవిత పేర్కొన్నారు. భౌగోళిక తెలంగాణ సాధించిన తర్వాత సామాజిక తెలంగాణ సాధించాలన్న ఆయన కలను నిజం చేయడానికి కట్టుబడి ఉన్నానని చెప్పారు. సమాజంలోని వెనుకబడిన వర్గాలకు నిజమైన సాధికారత వచ్చే వరకు ఈ ఉద్యమం కొనసాగుతుందని తెలిపారు.

**బీసీ రిజర్వేషన్ బిల్లుపై అల్టిమేటం**

చట్టసభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్ కల్పించే బిల్లును వచ్చే బడ్జెట్ సమావేశాల్లోనే ఆమోదించి రాష్ట్రపతి ఆమోదానికి పంపాలని కవిత డిమాండ్ చేశారు. లేకపోతే వెయ్యి కార్లతో 'ఛలో ఢిల్లీ' కార్యక్రమాన్ని నిర్వహించి భారీ ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. బీసీ రిజర్వేషన్ విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రాజకీయాలు చేయకుండా చిత్తశుద్ధితో వ్యవహరించాలని కోరారు.

**అన్ని వర్గాలకు సమాన న్యాయం**

ఎస్సీ, ఎస్టీ నిధులు వారి అభ్యున్నతికే ఖర్చు చేయాలని, ముస్లింలు, క్రిస్టియన్లు, సిక్కులకు ఆర్థిక స్వావలంభన కల్పించే చర్యలు తీసుకోవాలని కవిత డిమాండ్ చేశారు. ట్రాన్స్‌జెండర్లు, వికలాంగులు, ఆదివాసీల హక్కుల పరిరక్షణకు ప్రభుత్వాలు ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. మహిళలకు డీలిమిటేషన్‌తో సంబంధం లేకుండా చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని కోరారు.

**11 కీలక తీర్మానాలకు సభ ఆమోదం**

సంకల్ప సభలో కవిత 11 కీలక తీర్మానాలను ప్రతిపాదించారు. వీటిలో బీసీలకు చట్టసభల్లో 50 శాతం రిజర్వేషన్, మహాత్మా జ్యోతిరావ్ పూలే దంపతులకు భారతరత్న, ప్రొఫెసర్ జయశంకర్‌కు పద్మవిభూషణ్, ఎస్సీ–ఎస్టీ బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీ, ఆదివాసీలకు అటవీ హక్కులు, మహిళలకు 33 శాతం రిజర్వేషన్, ముస్లింలకు వక్ఫ్ చట్టం, ట్రాన్స్‌జెండర్లకు సంపూర్ణ హక్కులు, వికలాంగులకు పెన్షన్ల పెంపు వంటి అంశాలు ఉన్నాయి. సభికులు ఈ తీర్మానాలను ఏకగ్రీవంగా ఆమోదించారు.

**'#TRS4SocialJustice' దేశవ్యాప్తంగా ట్రెండింగ్**

సామాజిక న్యాయ తెలంగాణ సంకల్ప సభ అనంతరం కవిత ఎక్స్ (ట్విట్టర్)లో చేసిన #TRS4SocialJustice పోస్టు దేశవ్యాప్తంగా విశేష స్పందన పొందింది. సరూర్‌నగర్ సభలో పార్టీ నాయకులతో ప్రతిజ్ఞ చేయించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో ఆ హ్యాష్‌ట్యాగ్ భారతదేశంలో నంబర్‌వన్ ట్రెండింగ్‌లో నిలిచిందని పార్టీ వర్గాలు తెలిపాయి.

## జయశంకర్ ఆశయాల సాధనకు ప్రభుత్వం కట్టుబడి ఉంది

**- సీఎం రేవంత్ రెడ్డి**



**ముద్ర, హైదరాబాద్ :** ప్రొఫెసర్ జయశంకర్ జయంతి సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జూబ్లీహిల్స్ లోని తన నివాసంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమానికి సిద్ధాంతకర్తగా ప్రొఫెసర్ జయశంకర్ పోషించిన పాత్ర అత్యంత కీలకమైందని పేర్కొన్నారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జీవితాంతం అహర్నిశలు శ్రమించిన మహనీయుడిగా ఆయనను కొనియాడారు. ప్రొఫెసర్ జయశంకర్ ఆశయాలను సాకారం చేయడంలో ప్రజా ప్రభుత్వం పూర్తిస్థాయిలో కట్టుబడి ఉందని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఆయన చూపిన మార్గంలో తెలంగాణ అభివృద్ధి, ప్రజల ఆకాంక్షల సాధన దిశగా ప్రభుత్వం ముందుకు సాగుతుందని తెలిపారు.

## తల్లిదండ్రులంటే ఇంత చులకనా?

**- సమాజం మారాలని సజ్జనార్ ఆవేదన**



**ముద్ర, హైదరాబాద్:** తల్లిదండ్రుల పట్ల ప్రేమ, బాధ్యతలు తగ్గిపోతున్న తీరుపై మాజీ వీసీ అండ్ ఎండీ సజ్జనార్ ఐపీఎస్ సోషల్ మీడియాలో ఆవేదన వ్యక్తం చేశారు. హరియాణాలోని సోనిపట్‌కు చెందిన ఓ వృద్ధ వ్యాపారవేత్త వృద్ధాశ్రమంలో మరణించగా, ఆయన కుమార్తెలు అంత్యక్రియలకు హాజరుకాకుండా వీడియో కాల్ ద్వారానే వీక్షించారని పేర్కొన్నారు. చివరి కార్యాల కోసం రూ.5,100 మాత్రమే పంపించడం బాధాకరమని అన్నారు. తల్లిదండ్రులు బతికున్నప్పుడే వారిని ప్రేమగా చూసుకోవడం, చివరి క్షణాల్లో తోడుగా నిలవడం పిల్లల ప్రాథమిక బాధ్యత అని సజ్జనార్ పేర్కొన్నారు. మానవత్వానికి మచ్చ తెచ్చే ఇలాంటి సంస్కృతి మారాలని ఆయన పిలుపునిచ్చారు.

## సింధు హాస్పిటల్స్‌లో తొలి HITHOC చికిత్స విజయవంతం

**- అరుదైన స్టేజ్ IVA థైమోమా రోగికి నూతన జీవం**

**ముద్ర, హైదరాబాద్ :** క్యాన్సర్ చికిత్సలో సింధు హాస్పిటల్స్ మరో మైలురాయిని నమోదు చేసింది. ఆసుపత్రిలో తొలిసారిగా హైపర్‌థర్మిక్ ఇంట్రాథోరాసిక్ కెమోథెరపీ (HITHOC) విధానంతో అత్యాధునిక శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించి, అరుదైన స్టేజ్ IVA టైప్–B థైమోమా (థైమస్ గ్రంథి క్యాన్సర్)తో బాధపడుతున్న 35 ఏళ్ల రోగికి విజయవంతంగా చికిత్స అందించింది. వైద్యుల వివరాల ప్రకారం, నియోఅడ్జువెంట్ కీమోథెరపీ అనంతరం వ్యాధి కొంతవరకు తగ్గినప్పటికీ, రోగి ఊపిరితిత్తుల పనితీరు బలహీనంగా ఉండటం, ఎడమ ఛాతీ భాగమంతా క్యాన్సర్ వ్యాపించడం వల్ల చికిత్స అత్యంత క్లిష్టంగా మారింది. ఈ నేపథ్యంలో థైమెక్టమీ, ఎడమ టోటల్ ప్లూరెక్టమీ, సెగ్మెంటల్ లంగ్ రిసెక్షన్ అనంతరం HITHOC విధానాన్ని విజయవంతంగా నిర్వహించారు. ప్రస్తుతం రోగి పూర్తిగా కోలుకుని, స్థిరమైన ఆరోగ్య పరిస్థితితో ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అవుతున్నారు. డా. కె.వి.వి.ఎన్. రాజు ఆధ్వర్యంలోని సర్జికల్ ఆంకాలజీ విభాగం వైద్యులు డా. మధు నారాయణ, డా. ఫైసల్, అనస్థీషియా విభాగానికి చెందిన డా. వేణుగోపాల్ నేతృత్వంలోని డా. శ్యామ్, డా. సురేష్ బాబు, అలాగే డా. ఆర్.వి. రావు ఆధ్వర్యంలోని మెడికల్ ఆంకాలజీ విభాగం వైద్యులు డా. అరుణ్, డా. సౌమిక ఈ చికిత్సలో పాల్గొన్నారు. ఎంపిక చేసిన స్టేజ్ IVA థైమోమా రోగుల్లో థైమెక్టమీతో పాటు ప్లూరల్ వ్యాధిని పూర్తిగా తొలగించి HITHOC నిర్వహించడం ద్వారా దీర్ఘకాలిక వ్యాధి నియంత్రణ సాధించడంతో పాటు, కొన్ని సందర్భాల్లో పూర్తిస్థాయి నయం అయ్యే అవకాశాలు కూడా ఉంటాయని వైద్యులు తెలిపారు. ఈ సందర్భంగా సింధు హాస్పిటల్స్ చైర్మన్ డా. బండి పార్థసారథి రెడ్డి వైద్య బృందాన్ని అభినందిస్తూ, అత్యాధునిక సాంకేతికతతో నాణ్యమైన క్యాన్సర్ చికిత్స అందించడంలో సింధు హాస్పిటల్స్ ఎల్లప్పుడూ ముందుంటుందని తెలిపారు.

## జయశంకర్ సార్ కు స్పోర్ట్స్ అథారిటీ ఘనంగా నివాళులు



**ముద్ర, హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం కోసం జీవితాంతం కృషి చేసిన ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ సేవలను ఎల్లప్పుడూ స్మరించుకోవాలని తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ సోనీ బాలాదేవి అన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈరోజు తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో ప్రొఫెసర్ జయశంకర్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని రెండు నిమిషాల మౌనం పాటించి, తెలంగాణ సాధనలో ప్రొఫెసర్ జయశంకర్ చేసిన విశిష్ట సేవలను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో స్పోర్ట్స్ అథారిటీ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ శ్రీమతి అనిత, డిప్యూటీ డైరెక్టర్లు రవీందర్, శ్రీనివాస్ రవితేజ, ఇంజనీర్ శ్రీనివాస్, పి ఆర్ ఓ కాలేరు సురేష్ అసిస్టెంట్ డైరెక్టర్ అశ్విని దడ్వే శాలిని మినిస్టీరియల్ సిబ్బంది మరియు ఇతర ఉద్యోగులు పాల్గొని ఆయనకు ఘనంగా నివాళులు అర్పించారు

## సనాతన భారత చరిత్ర సారమే పురాణాలు

**ముద్ర, కోరుట్ల;** సనాతన భారతీయ సాంస్కృతిక, ఆధ్యాత్మిక, చారిత్రక సాక్షాల సారమే మన 'అష్టాదశ మహా పురాణాల' ని శృంగేరి శారదాపీఠ ఆస్థాన పౌరాణికులు, పురాణ ప్రవర బ్రహ్మశ్రీ డాక్టర్ గర్రెపల్లి మహేశ్వరశర్మ పేర్కొన్నారు. సనాతన ధర్మ ప్రచార సమితి ఆధ్వర్యంలో చేపట్టిన అష్టాదశ మహాపురాణ ప్రవచన జ్ఞాన యజ్ఞంలో భాగంగా శ్రీ బ్రహ్మ మహాపురాణ ప్రవచన సప్తాహం 6వ రోజు కోరుట్ల వాసవి కళ్యాణ భవనంలో గురువారం సాయంత్రం ఘనంగా జరిగింది. సనాతన ధర్మ ప్రచార సమితి ప్రధాన కార్యదర్శి బట్టు హరికృష్ణ, కోశాధికారి రేగుంట రాజారామ్, శ్రీనివాస్, పడిగెల పవన్, పాల్గొన్నారు.

## 20 నెలల్లో 150 జీసీసీలు.. 1.5 లక్షల ఉద్యోగాలు

**- హైదరాబాద్‌లో జేఎల్ఎల్ జీసీసీ ప్రారంభించిన శ్రీధర్ బాబు**

**- జీసీసీలకు తెలంగాణ హబ్.. పెట్టుబడులకు కొత్త ఊపు**

**- కొత్త జేఎల్ఎల్ కేంద్రంతో మరో 1,600 ఉద్యోగాల అవకాశం**

**- జాతీయ జీసీసీ లీజింగ్‌లో హైదరాబాద్‌కు 16% వాటా**



**ముద్ర, హైదరాబాద్:** గత 20 నెలల్లో తెలంగాణలో ఏర్పాటైన 150 గ్లోబల్ కెపబిలిటీ సెంటర్ల (జీసీసీలు) ద్వారా 1.5 లక్షల మందికి ఉపాధి లభించిందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలిపారు. హైదరాబాద్ ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లో జేఎల్ఎల్ సంస్థ ఏర్పాటు చేసిన జీసీసీని గురువారం ఆయన ప్రారంభించారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ప్రపంచ పెట్టుబడులకు మార్గనిర్దేశం చేసే జేఎల్ఎల్ హైదరాబాద్‌ను జీసీసీ కేంద్రంగా ఎంచుకోవడం రాష్ట్ర సామర్థ్యానికి నిదర్శనమన్నారు. అత్యుత్తమ మౌలిక వసతులు, నైపుణ్య మానవ వనరులు, పరిశ్రమలకు అనుకూల విధానాల వల్ల తెలంగాణ జీసీసీలకు ప్రధాన కేంద్రంగా ఎదిగిందని చెప్పారు. ఏఐ సిటీ, రీజినల్ రింగ్ రోడ్ వంటి ప్రాజెక్టులు భవిష్యత్ పెట్టుబడులకు బలం చేకూరుస్తాయన్నారు.

2024–26 మధ్య దేశవ్యాప్తంగా జీసీసీ కార్యాలయ లీజింగ్‌లో హైదరాబాద్ వాటా 16 శాతం కాగా, నగరంలో మొత్తం కార్యాలయ లీజింగ్‌లో జీసీసీల వాటా 42 శాతం నమోదైందన్నారు. ఆరోగ్య సంరక్షణ, బయోటెక్నాలజీ, సెమీకండక్టర్ రంగాల్లోనూ హైదరాబాద్‌కు ఆదరణ పెరుగుతోందని తెలిపారు. జేఎల్ఎల్ కొత్త జీసీసీ పూర్తిస్థాయిలో ప్రారంభమైతే వచ్చే రెండేళ్లలో సుమారు 1,600 మందికి ఉద్యోగాలు లభిస్తాయని మంత్రి పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో జేఎల్ఎల్ ఇండియా సీఈఓ రాధా ధిర్, హైదరాబాద్ సీనియర్ మేనేజింగ్ డైరెక్టర్ సందీప్ పట్నాయక్, గ్లోబల్ సర్వీస్ సెంటర్ హెడ్ ధీరజ్ పోప్లీ, ఐటీ శాఖ సలహాదారు సాయి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## గచ్చిబౌలి స్టేడియాన్ని సందర్శించిన అమెరికా కాన్సులేట్ ప్రతినిధులు



**ముద్ర, హైదరాబాద్ :** అమెరికా కాన్సులేట్ ప్రతినిధులు గురువారం స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ (ఎస్ఏటీజీ)ను సందర్శించి, రాష్ట్రంలో క్రీడల అభివృద్ధి కోసం తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న విధానాలు, కార్యక్రమాలపై అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ మేనేజింగ్ డైరెక్టర్ డా. ఎ. సోనిబాలా దేవి, ఐఎఫ్ఎస్, తెలంగాణ క్రీడా విధానం, గ్రామీణ స్థాయి నుంచి అంతర్జాతీయ స్థాయి వరకు క్రీడాకారులను తీర్చిదిద్దేందుకు చేపడుతున్న చర్యలు, ప్రతిభా గుర్తింపు కార్యక్రమాలు, క్రీడాకారుల అభివృద్ధి కార్యాచరణ, అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన క్రీడా మౌలిక వసతుల కల్పన, ఆధునిక శిక్షణా సౌకర్యాలు, అలాగే రాష్ట్రంలో క్రీడా సంస్కృతిని మరింత బలోపేతం చేసేందుకు ప్రభుత్వం చేపడుతున్న వివిధ కార్యక్రమాలను ప్రతినిధులకు సమగ్రంగా వివరించారు. తెలంగాణ ప్రభుత్వం క్రీడా రంగ అభివృద్ధికి చేపడుతున్న కార్యక్రమాలు, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ అమలు చేస్తున్న కార్యాచరణను అమెరికా కాన్సులేట్ ప్రతినిధులు అభినందించారు. రాష్ట్రంలో సమగ్ర క్రీడా పర్యావరణ వ్యవస్థ ఏర్పాటుకు ప్రభుత్వం అనుసరిస్తున్న వ్యూహాత్మక విధానాన్ని ప్రశంసించారు. భవిష్యత్తులో పరస్పర సహకారంతో క్రీడా అభివృద్ధి, క్రీడాకారుల సామర్థ్య వృద్ధి, అంతర్జాతీయ భాగస్వామ్య అవకాశాల కల్పనకు అవసరమైన సహకారం అందించేందుకు తమ సంసిద్ధతను వ్యక్తం చేశారు.

సమావేశం సానుకూల వాతావరణంలో కొనసాగగా, క్రీడా రంగంలో ద్వైపాక్షిక సహకార అవకాశాలను మరింత విస్తరించడం, అంతర్జాతీయ భాగస్వామ్యాన్ని బలోపేతం చేయడం ద్వారా తెలంగాణలో క్రీడా అభివృద్ధికి తోడ్పడే అంశాలపై ఇరుపక్షాలు అభిప్రాయాలు పంచుకున్నాయి.

## తెలంగాణ సిద్ధాంతకర్తకు ఘన నివాళులు




**ముద్ర, బోడుప్పల్:** మల్కాజిగిరి మునిసిపల్ కార్పొరేషన్ బోడుప్పల్ సర్కిల్ కార్యాలయంలో ప్రొఫెసర్ కొత్తపల్లి జయశం కర్ కు ఘనంగా నివాళులు అర్పించారు. తెలంగాణ సిద్ధాంత కర్త, ప్రముఖ విద్యా వేత్త దివంగత జయశంకర్ జయంతి వేడుకలను మునిసిపల్ సర్కిల్ కార్యాలయంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బోడుప్పల్ డిప్యూటీ కమిషనర్ ఎ. శైలజ ప్రొఫెసర్ జయశంకర్ గారి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో ఆయన చేసిన విశిష్ట సేవలను స్మరించుకుంటూ, ఆయన ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్కిల్ అధికారులు, సిబ్బంది పాల్గొని ప్రొఫెసర్ జయశంకర్ గారికి ఘన నివాళులు అర్పించారు.

## గ్రామాభివృద్ధికి సమగ్ర ప్రణాళిక అవసరం: దానకిశోర్

**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి:** గ్రామాలు స్వయం సమృద్ధి సాధించి స్థిరమైన ఆదాయ వనరులు ఏర్పరచుకునేలా వినూత్న అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేయాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ దానకిశోర్ సూచించారు. అనంతారం గ్రామంలో నిర్వహించిన గ్రామపంచాయతీ సమగ్ర అభివృద్ధి ప్రణాళిక (జీపీడీపీ) అమలు కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, రాబోయే మూడు సంవత్సరాల అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని శాస్త్రీయ ప్రణాళికలు రూపొందించాలని అన్నారు. అనంతారం గ్రామాన్ని పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసినట్లు తెలిపారు. గ్రామాభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం, మహిళా సంఘాల పాత్ర కీలకమని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి పేర్కొన్నారు. అనంతరం అధికారులు గ్రామంలో చేపట్టిన అభివృద్ధి పనులను పరిశీలించి, ఫామ్ పాండ్స్ నిర్మాణానికి శంకుస్థాపన చేసి వనమహోత్సవం సందర్భంగా మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈఓ శోభారాణి, అదనపు డీఆర్‌డీఓ సురేష్, అదనపు డీఆర్‌డీఓ (సెర్ప్) జంగారెడ్డి, డిప్యూటీ సీఈఓ శ్రీనివాస్, జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్ రెడ్డి, జిల్లా విద్యా అధికారి బిక్షపతి,మండల ప్రత్యేక అధికారి శ్యాంసుందర్, సర్పంచ్ నాగరాణి, జిల్లా, మండల సమాఖ్య అధ్యక్షులు, వార్డు సభ్యులు, సంఘ బంధ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయ సంఘాల క్రమబద్ధీకరణకు చర్యలు తీసుకోవాలి: ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్



**ముద్ర, హైదరాబాద్:** తెలంగాణలో ఉపాధ్యాయ సంఘాల సంఖ్య విచ్చలవిడిగా పెరగడం వల్ల ప్రభుత్వ విద్యా వ్యవస్థపై ప్రతికూల ప్రభావం పడుతోందని ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ (ఎఫ్ఎఫ్‌జీ) అధ్యక్షుడు ఎం. పద్మనాభరెడ్డి పేర్కొన్నారు. రాష్ట్రంలో ప్రస్తు తం సుమారు 48 ఉపాధ్యాయ సంఘాలు కార్యకలాపాలు నిర్వహిస్తున్నా యని, ఇది బోధన, పాఠశాలల నిర్వహణపై ప్రభావం చూపుతోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి లేఖ రాశారు. సంఘాల కార్యకలాపాలను క్రమబద్ధీకరించాలని, ఆఫీస్ బేరర్లకు కల్పిస్తున్న ప్రత్యేక సౌకర్యా లను పునః సమీక్షించి అత్యవసరమైన కొద్దిమందికే పరిమితం చేయాలని కోరారు. ఉపాధ్యాయుల క్రమబద్ధమైన హాజరు, బోధన బాధ్యతల అమలు, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాల మెరుగుదల కోసం సంస్కరణలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
www.mudranews.in
@mudranews
mudratv
శుక్రవారం 07.08.2026



నా తెలంగాణ కోటి రతనాల వీణ అన్నాడు 'దాశరథి'.. నైజాం పాలనలో 'బండెనక బండి కట్టి'.. పాటలతో ఉద్యమాన్ని రగిలించిననేల ఇదీ.. తెలంగాణ రక్తంలోనే కవిత్వం ఉంది.. కవులు, కళాకారులకు ఈ నేల పుట్టినిల్లు.. అందుకే మీలోని రచయితను మేల్కొలపండి.. కవితలు, వ్యాసాలు, సంపాదకీయాలు ఏవైనా సరే.. మేం ప్రచురిస్తాం.. మన 'ముద్ర'లో ఎడిటోరియల్ గా మీ భావాలను వ్యక్తీకరించండి..
మీ రచనలు పంపాల్సిన వాట్సాప్ నం.: +91 98496 23744
అలాగే ఈ-మెయిల్ కూడా చేయొచ్చు: mudradaily@gmail.com

# వర్షాకాలం కారు ప్రయాణం

## ఈ 10 టిప్స్ పాటించండి

దేశంలోని అన్ని రాష్ట్రాలలో కూడా ఇప్పుడు వర్షాలు కురుస్తున్నాయి. ఎంత వర్షాలు వచ్చినా, ఎండలు ఉన్నా, చలి ఉన్నా సరే పనులకు వెళ్లడం మాత్రం తప్పదు. కదా. ఇక ఈ సమయంలో వర్షంలో తడవకుండా ఉండటానికి చాలా మంది కారులను ఉపయోగిస్తారు. కారు డ్రైవింగ్ కే లైక్ కొడతారు. అంతేకాదు కొంతమంది వర్షాకాలంలో కొండ ప్రాంతాల్లో కూడా ప్రయాణించడానికి బయలుదేరుతారు. కానీ మార్గమధ్యలో ఎక్కడో వర్షం పడటం ప్రారంభిస్తే, మీ కారు చిక్కుకుపోయే ప్రమాదం ఎక్కువ ఉంటుంది. ఈ సీజన్‌లో వాహనాన్ని నడపడం అంత ఈజీ కాదు. డ్రైవింగ్ చేస్తున్నప్పుడు చాలా ఇబ్బందులను ఎదుర్కోవలసి రావచ్చు. ఈ సీజన్‌లో దృశ్యమానత కూడా తగ్గుతుంది. అందుకే చాలా జాగ్రత్తగా కారు డ్రైవింగ్ చేయాల్సి ఉంటుంది. మరి ఈ సమయంలో ఎలాంటి టిప్స్‌ను గుర్తు పెట్టుకోవాలంటే?

### మీ లేన్ లో డ్రైవ్ చేయండి

వర్షాకాలంలో సురక్షితంగా ఉండటానికి ఉత్తమ మార్గం మీ స్వంత లేన్‌లో నడపడం. ముందు నుంచి వస్తున్న వాహనాన్ని మీరు చూడరు. ఇలాంటి పరిస్థితిలో ఏదైనా ప్రమాదం అకస్మాత్తుగా జరగవచ్చు. కాబట్టి మీ స్వంత లేన్‌లో నడపడానికి ప్రయత్నించండి.



వర్షాకాలంలో రోడ్లు జారుడుగా మారుతాయి. అటువంటి పరిస్థితిలో, ప్రమాదాలు జరిగే ప్రమాదం ఎక్కువ ఉంటుంది. ఈ సమస్యను నివారించడానికి ఈ రోజు మేము మీకు కొన్ని చిట్కాలను చెబుతున్నారు. వీటిని ఉపయోగిస్తే మీరు వర్షాకాలంలో కూడా కారును సులభంగా నడపవచ్చు. వర్షం పడినప్పుడు, కారు కిటికీలు మూసి ఉంటాయి. దీని కారణంగా కారు విండ్‌స్క్రీన్ పొగమంచుగా మారుతుంది. ముందు భాగం సరిగ్గా కనిపించదు. ఈ సమస్యను నివారించడానికి, డీఫాగర్, ACని ఉపయోగించాలి. దీనితో పాటు, వైపర్‌ను కూడా ఆన్‌లో ఉంచాలి. కారు విండ్‌స్క్రీన్‌ను లోపలి నుంచి తుడవకూడదు. విండో గ్లాస్‌పై పొగమంచు ఉంటే, విండోను కిందికి తిప్పి శుభ్రం చేయండి.

### లైట్లను ఉపయోగించండి

కార్ లైట్లు కూడా కొన్నిసార్లు చాలా ఉపయోగకరంగా ఉంటాయి. మీ కారులో డేటైమ్ రన్నింగ్ లైట్లు (DRL) ఉంటే, వర్షం సమయంలో వాటిని ఉపయోగించండి. దీనివల్ల ఇతరులు మీ కారును దూరం నుంచి చూసే అవకాశం ఉంటుంది. రాత్రిపూట హై బీమ్ ఉపయోగించవద్దు.

### వేగం

ఎక్కడికైనా త్వరగా చేరుకోవడానికి ఎప్పుడూ అధిక వేగంతో డ్రైవ్ చేయకండి. వర్షాకాలంలో, రోడ్డు తడిగా ఉంటుంది. మీరు అకస్మాత్తుగా బ్రేకులు వేస్తే వాహనం జారిపోయే ప్రమాదం ఉంది. కాబట్టి, సగటు వేగంతో నడపడం చాలా మంచిది.

### నీటి ఎద్దడి

నీటిలో మునిగిపోయిన రోడ్డుపై ప్రయాణించకుండా ఉండండి. రోడ్డుపై నీరు ఉంటే చాలామంది అలాగే వెళ్లడానికి ప్రయత్నిస్తుంటారు. కానీ జాగ్రత్త. ఏదైనా గుంతలు ఉండే అవకాశం ఎక్కువగా ఉంటుంది. ఈ పరిస్థితిలో నీటి లోతును అంచనా వేయడం చాలా కష్టం. ఈ రోడ్లపై మీ వాహనం ఆగి చెడిపోవచ్చు. అలాంటి పరిస్థితిలో, వేరే మార్గాన్ని ఎంచుకోవాలి.

వర్షాకాలంలో భారీగా బ్రేకింగ్ చేయకూడదు. వాహనం నడుపుతున్నప్పుడు నెమ్మదిగా నడపాలి. అధిక వేగంతో డ్రైవింగ్ చేసేటప్పుడు అకస్మాత్తుగా మీ ముందు ఏదైనా వస్తే త్వరగా బ్రేకింగ్ చేయాల్సి ఉంటుంది. దీని వల్ల వాహనం జారిపోయే అవకాశం ఉంది.

# ఈఎంఐ భారం తీరుతుందిలా

ప్రస్తుత కాలంలో క్రెడిట్ కార్డు బిల్లులు, పర్సనల్ లోన్లు చాలా మందికి భారంగా మారుతున్నాయి. ఇవి కొన్ని అవసరాలకు ఉపయోగపడినప్పటికీ అధిక వడ్డీ కారణంగా ప్రతి నెల చెల్లించే ఈఎంఐలతో అవస్థలు పడుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఈఎంఐ భారం తగ్గించే ప్రయత్నం చేస్తోంది ఈ ప్లాట్ ఫాం. ఇది నేరుగా రుణాలు ఇచ్చే సంస్థ కాదు. కానీ ఆర్బీఐలో నమోదైన ఎన్‌బీఎఫ్‌సీతో భాగస్వామ్యం కావడంతో వినియోగదారులకు తక్కువ వడ్డీ రేటుతో రీ ఫైనాన్స్ అవకాశాన్ని కల్పిస్తుంది. ఇంతకీ అది ఏ ప్లాట్ ఫాం?

ఈఎంఐ భారాన్ని bllcut.com ద్వారా తొలగించుకోవచ్చని అంటున్నారు ఆర్థిక నిపుణులు. దీని ద్వారా అధిక వడ్డీతో ఉన్న క్రెడిట్ కార్డ్ బకాయిలు లేదా ఇతర రుణాలను తక్కువ వడ్డీ రేటు ఉన్న కొత్త లోన్ లేదా ఈఎంఐ ప్లాన్‌లోకి మార్చే అవకాశాన్ని పరిశీలిస్తుంది. ఉదాహరణకు, ఒక క్రెడిట్ కార్డుపై సంవత్సరానికి 36 నుంచి 48 శాతం వరకు వడ్డీ చెల్లిస్తున్న వినియోగదారుడికి, భాగస్వామ్య NBFC ల ద్వారా తక్కువ వడ్డీతో రుణం అవకాశం కల్పిస్తుంది. అదే బకాయిని ఒక స్థిరమైన ఈఎంఐ రూపంలో మార్చే అవకాశం ఉంటుంది.

మొదట BillCut వెబ్‌సైట్ లేదా యాప్‌లో మొబైల్ నంబర్‌తో నమోదు చేసుకోవాలి. అనంతరం పాన్ వంటి వివరాలు ఇచ్చి, క్రెడిట్ ప్రొఫైల్‌ను పరిశీలించేందుకు వినియోగదారుడు అనుమతివ్వాలి. ఆ తర్వాత సిబిల్ స్కోర్, ప్రస్తుతం ఉన్న రుణాలు, బకాయిలు, చెల్లింపు చరిత్ర వంటి వివరాలను విశ్లేషించి, అర్హత ఉంటే అందుబాటులో ఉన్న లోన్ లేదా ఈఎంఐ ఆఫర్లను చూపిస్తుంది. వినియోగదారు ఆ ఆఫర్‌ను అంగీకరిస్తే, కొత్త లోన్ ద్వారా పాత అధిక వడ్డీ బకాయిని క్లియర్ చేసి, కొత్త ఈఎంఐ ప్లాన్ ప్రారంభమవుతుంది.

కేవలం క్రెడిట్ కార్డులకే కాకుండా పర్సనల్ లోన్లు, హోమ్ లోన్లు, కార్ లోన్లు వంటి రుణాల భారాన్ని తగ్గించుకునేందుకు దీనిని ఎంపిక చేసుకోవచ్చు. అయితే ప్రతి ఒక్కరూ ఇందులో అర్హత పొందుతారని చెప్పలేం. వినియోగదారుడి క్రెడిట్ స్కోర్, ఇప్పటికే ఉన్న రుణ భారం ల ఆధారంగా అర్హత నిర్ణయిస్తారు. అర్హత ఉంటే మాత్రమే తక్కువ వడ్డీతో కొత్త లోన్ ఆఫర్ లభిస్తుంది.

# సంపద, భద్రతలో ఆదర్శం

## పేదరికం లేని చిన్న దేశాలు

ప్రపంచంలో పరిమాణం చాలా చిన్నగా ఉన్నా సంపదలో అగ్రస్థానంలో నిలిచిన మూడు దేశాలు ఉన్నాయి. మొనాకో, లక్సెంబర్గ్, లిక్టెన్‌స్టెన్. ఇవి పెద్ద దేశాల్లాగా విస్తీర్ణం లేకపోయినా, తలసరి ఆదాయం, జీవన ప్రమాణాలు, భద్రతలో అసాధారణంగా ముందున్నాయి. పేదరికం అనే పదం ఇక్కడ దాదాపు అస్తిత్వం లేని స్థాయికి చేరుకుంది. వీటి విజయం వెనుక చిన్న పరిమాణం, తెలివైన విధానాలు, ప్రత్యేక ఆర్థిక నమూనాలు ఉన్నాయి.



### మన పల్లెటూరు కన్నా చిన్న మొనాకో..

మొనాకో ప్రపంచంలోని రెండో అతి చిన్న దేశం. దాని విస్తీర్ణం కొన్ని చదరపు కిలోమీటర్లు మాత్రమే. ఒక గంటలో దేశం మొత్తం చుట్టి రావచ్చు. అయినా ఇక్కడ భూమి ధరలు ఆకాశాన్ని తాకుతాయి. ప్రతి అడుగు స్థలం కోట్ల రూపాయల విలువైనది. ఖరీదైన కార్లు రోడ్లపై సాధారణం. బాలీవుడ్, హాలీవుడ్ స్టార్స్, ప్రముఖ క్రీడాకారులు ఇక్కడ స్థిరపడాలని ఆశిస్తారు. ఇక్కడి ప్రత్యేకతల్లో ఒకటి పన్ను విధానం. నివాసితులు వ్యక్తిగత ఆదాయపు పన్ను చెల్లించాల్సిన అవసరం లేదు. దీని వల్ల సంపన్నులు ఆకర్షితులవుతారు. ప్రతి ఇద్దరిలో ఒకరు కోటీశ్వరుల స్థాయిలో ఉండే వాతావరణం ఉంది. భద్రత విషయంలో అత్యాధునిక స్థాయి. అడుగడుగునా కెమెరాలు, హైటెక్ పోలీసు వ్యవస్థ ఉండటం వల్ల నేరాలు చాలా తక్కువ. వైద్య సదుపాయాలు అధునాతనంగా ఉండటం, క్రమశిక్షణకు అధిక ప్రాధాన్యం ఇవ్వడం వల్ల ప్రజల సగటు ఆయుర్దాయం 90 ఏళ్లు రోడ్డుపై చొక్కా లేకుండా నడవడం లేదా చెత్త వేయడం వంటివి భారీ జరిమానాకు దారితీస్తాయి. మొనాకో గ్రాండ్ ప్రిక్స్ ప్రపంచ ప్రసిద్ధి. రోడ్లపైనే వేగవంతమైన కార్ రేస్ జరుగుతుంది. 19వ శతాబ్దంలో నిర్మించిన కాసినో మరో ఆకర్షణ. కానీ స్థానికులు అందులో ఆడడం నిషేధం. విదేశీయుల కోసమే అది నిర్వహిస్తారు. ఇలా పర్యాటకం, ఫైనాన్స్, లగ్జరీ జీవనశైలి కలయిక ఈ చిన్న దేశాన్ని సంపదలో అగ్రస్థానానికి చేర్చింది.



### యూరప్ పవర్‌హౌస్ లక్సెంబర్గ్

లక్సెంబర్గ్ విస్తీర్ణం గోవా కంటే చిన్నది. ఫ్రాన్స్, జర్మనీ మధ్య ఉన్న ఈ దేశాన్ని యూరప్ పవర్‌హౌస్‌గా పిలుస్తారు. సంపద విషయంలో ప్రపంచంలోని అత్యంత ధనిక దేశాల్లో ఒకటి. ఇక్కడ పని చేసే వ్యక్తికి కనీస వేతనం చాలా ఎక్కువ. నెలకు వేల యూరోలు అందుతాయి. ఇది సాధారణ ఉద్యోగులకు కూడా మంచి జీవన ప్రమాణాలు అందిస్తుంది. ఈ దేశం ప్రపంచ ఫైనాన్షియల్ హబ్‌గా పనిచేస్తుంది. పెద్ద పెద్ద బ్యాంకులు, పెట్టుబడి నిధులు ఇక్కడ కేంద్రీకృతమయ్యాయి. రోజూ వేల కోట్ల లావాదేవీలు జరుగుతాయి. వాతావరణం స్వచ్ఛంగా, పచ్చదనం ఎక్కువగా ఉండటం వల్ల దీన్ని యూరప్ గ్రీన్ హార్ట్‌గా కూడా పిలుస్తారు. ప్రజలు సాధారణంగా ప్రశాంతంగా జీవిస్తారు. నమ్మకం ఎక్కువ. అనేక మంది మూడు భాషలు సులభంగా మాట్లాడగలరు. ఇలా ఆర్థిక శక్తి, పర్యావరణ సమతుల్యత, సామాజిక స్థిరత్వం కలిసి పేదరికాన్ని దూరం చేశాయి.



### పర్వతాల మధ్య దాగిన లిక్టెన్‌స్టెన్..

ఆస్ట్రియా, స్విట్జర్లాండ్ సరిహద్దులో పర్వతాల మధ్య ఉన్న లిక్టెన్‌స్టెన్ చాలా మందికి పేరు కూడా తెలియని దేశం. దాని విస్తీర్ణం ఢిల్లీ కంటే చాలా చిన్నది. అయినా తలసరి ఆదాయం చాలా ఎక్కువ. ఇక్కడ పని చేసే వ్యక్తి సులభంగా మంచి సంపాదన సాధించగలడు. పొరుగు దేశాల నుంచి కూడా చాలా మంది ఉపాధి కోసం వస్తారు. ఈ దేశం బలం దాని పరిశ్రమల్లో ఉంది. అధునాతన యంత్రాలు, డెంటల్ ఉత్పత్తులు ముఖ్యంగా కృత్రిమ పళ్లు, ఫార్మా ఉత్పత్తులు ఇక్కడ తయారవుతాయి. ప్రపంచ వ్యాప్తంగా ఎగుమతి అవుతాయి. మంచు పర్వతాలు, పచ్చని లోయలు ట్రెక్కింగ్, స్కీయింగ్‌కు ప్రసిద్ధి. ద్రాక్ష తోటల నుంచి నాణ్యమైన వైన్ తయారవుతుంది.

### ఇప్పటికీ రాచరికం..

ఇక్కడ ఇప్పటికీ రాచరికం కొనసాగుతోంది. రాజు కోటలోనే నివసిస్తాడు. దేశానికి సైన్యం లేదు. శాంతిని గొప్ప ఆయుధంగా భావిస్తారు. విమానాశ్రయం కూడా లేదు. పొరుగు దేశాల సౌకర్యాలు వాడుకుంటారు. భద్రత అంత ఎక్కువగా ఉండటం వల్ల చాలా మంది రాత్రి తలుపులు కూడా వేసుకోరు. జాతీయ దినోత్సవం రోజున రాజభవనం అందరికీ తెరిచి ఉంటుంది. ఇలా పరిశ్రమలు, సహజ అందం, సామాజిక విశ్వాసం కలిసి ఈ చిన్న దేశాన్ని సంపన్నంగా నిలిపాయి.

పరిమాణం పెద్దది కాకపోయినా, సరైన విధానాలు ఉంటే సంపద సృష్టించవచ్చని ఈ దేశాలు చూపిస్తున్నాయి. పన్ను ప్రోత్సాహకాలు, ఫైనాన్స్ హబ్‌గా అభివృద్ధి, అధునాతన పరిశ్రమలు, క్రమశిక్షణ, భద్రత, విద్య–వైద్య సదుపాయాలు కలిసి పేదరికాన్ని తగ్గించాయి. చిన్న జనాభా కారణంగా వనరులు సమర్థవంతంగా పంపిణీ అవుతాయి. ఇవి పెద్ద దేశాలకు కూడా పాఠాలు నేర్పుతున్నాయి. చిన్నదేశాలే ప్రపంచంలో సంపద, భద్ర త, జీవన ప్రమాణాల్లో ముందున్నాయి.

# ప్రకృతిశక్తితో అద్భుతం



తెలంగాణ రాష్ట్రంలోని వనపర్తి జిల్లా మదనాపూర్ మండలంలోని చిన్నవాగు (ఊకచెట్టు వాగు)పై ఉన్న సరళా సాగర్ ప్రాజెక్టు సాధారణ ఆనకట్టలకు భిన్నమైనది. గేట్లు ఎత్తాల్సిన అవసరం లేకుండా, విద్యుత్ సహాయం లేకుండా కేవలం గాలి–నీటి పరస్పర చర్యతో ఆటోమేటిక్‌గా పనిచేసే ఈ వ్యవస్థ ఇప్పటికీ ఇంజనీర్లను ఆశ్చర్యపరుస్తోంది. ఇది స్థానిక వనరులు, విదేశీ సాంకేతిక జ్ఞానం, భౌతిక శాస్త్ర సూత్రాల సమ్మేళనంగా నిలుస్తుంది.

### చారిత్రక నేపథ్యం..

1940 చివరలో వనపర్తి సంస్థానాధీశులు రాజా రామేశ్వరరావు ఈ ప్రాజెక్టును రూపొందించారు. అమెరికాలోని కాలిఫోర్నియాలో సైఫన్ టెక్నాలజీని చూసిన తర్వాత, దానిని స్థానిక పరిస్థితులకు అనుగుణంగా అనుసరించారు. తల్లి సరళాదేవి పేరు మీద ఈ ఆనకట్టకు పేరు పెట్టారు. 1949లో పునాదులు వేయబడి 1959లో పూర్తయిన ఈ ప్రాజెక్టు స్వాతంత్ర్యానంతర కాలంలోనే సాగునీటి రంగంలో కొత్త మార్గం చూపింది. ఇది కేవలం నీటి నిల్వ కాకుండా, మానవ ప్రమేయం లేని ఆటోమేటిక్ వ్యవస్థగా రూపొందింది.

### సైఫన్ వ్యవస్థ ప్రత్యేకత..

సాధారణ ఆనకట్టల్లో గేట్లు తెరిచి మూయాల్సి వస్తుంది. కానీ ఇక్కడ క్యూ ఆకారంలోని గొట్టాలు (సైఫన్లు) అమర్చబడ్డాయి. ఇవి ఫిజిక్స్‌లోని వాక్యూమ్ సూత్రం మీద ఆధారపడి పనిచేస్తాయి. డ్యాంలో నీటి మట్టం నిర్ణీత స్థాయిని దాటగానే గొట్టాల్లోకి నీరు చేరుతుంది. మరింత పెరిగితే గాలి పూర్తిగా బయటకు వెళ్లి శూన్యత ఏర్పడుతుంది. ఆ ప్రెజర్ తేడా వల్ల నీరు వేగంగా కిందకు లాగబడి నదిలోకి ప్రవహిస్తుంది. నీటి మట్టం తగ్గగానే గాలి తిరిగి ప్రవేశించి ప్రవాహం ఆగిపోతుంది. ఇలా గేట్లు, మోటార్లు లేదా మానవ నియంత్రణ అవసరం లేకుండా పూర్తి స్వయంచాలకంగా నడుస్తుంది.

### ఆసియాలో రెండోది..

ఆసియాలో ఇలాంటి సైఫన్ వ్యవస్థ ఉన్న ప్రాజెక్టుల్లో ఇది రెండోది. చిన్న సామర్థ్యం (సుమారు 0.5 టీఎంసీ) ఉన్నప్పటికీ, వేల ఎకరాల సాగుకు మద్దతు ఇస్తూ స్థిరమైన నీటి నిర్వహణకు ఉదాహరణగా నిలుస్తోంది. సుమారు 4,500 ఎకరాల వ్యవసాయ భూమికి సాగునీరు అందించే ఈ ప్రాజెక్టు స్థానిక రైతులకు జీవనాధారంగా మారింది. వర్షాధార ప్రాంతాల్లో నీటి లభ్యతను నిర్ధారించడం ద్వారా పంటల ఉత్పాదకతను పెంచింది. ఇలాంటి సహజ ఆధారిత పరిష్కారాలు నేటి కాలంలో మరింత అవసరం. వాతావరణ మార్పులు, విద్యుత్ కొరత, నిర్వ హణ ఖర్చులు పెరుగుతున్న నేపథ్యంలో సరళా సాగర్ లాంటి మోడళ్లు స్ఫూర్తినిస్తాయి.



### భౌతిక శాస్త్రం, సహజ సమతుల్యత..

ఈ వ్యవస్థ గురుత్వాకర్షణ, వాతావరణ పీడనం, శూన్యత వంటి ప్రాథమిక సూత్రాలను సమర్థవంతంగా ఉపయోగించుకుంటుంది. నీరు పైనుంచి కిందకు ప్రవహించే సహజ ధోరణిని నియంత్రించడం ద్వారా వరద నీటిని సురక్షితంగా విడుదల చేస్తుంది. ఇది పర్యావరణపరంగా కూడా లాభదాయకం. విద్యుత్ వినియోగం లేకపోవడం, యంత్రాల నిర్వహణ ఖర్చు తగ్గడం, దీర్ఘకాలిక మన్నిక పెరగడం వంటి ప్రయోజనాలు ఉన్నాయి. ఆధునిక ఇంజనీర్లు ఈ సాంకేతికతను చూసి ఆశ్చర్యపోవడం సహజం, ఎందుకంటే ఇప్పటి అధునాతన సెన్సార్లు, కంప్యూటర్ నియంత్రణలు లేకుండానే దశాబ్దాలుగా నమ్మకంగా పనిచేస్తోంది.

సరళా సాగర్ కేవలం ఒక ఆనకట్ట కాదు. ఇది మానవ ఆలోచన, ప్రకృతి శక్తుల సమన్వయానికి ప్రతీక. విదేశీ సాంకేతికతను స్థానిక అవసరాలకు అనుగుణంగా మార్చి, దీర్ఘకాలం నిలిచే వ్యవస్థను సృష్టించడం దీని గొప్పతనం. ఆధునిక ప్రాజెక్టులు సంక్లిష్ట యంత్రాలపై ఆధారపడుతున్నప్పుడు, ఇలాంటి సాధారణమైన కానీ సమర్థవంతమైన పరిష్కారాలను పునఃసమీక్షించాల్సిన అవసరం ఉంది.

### భోజనం చేసేటప్పుడు మొబైల్‌కు దూరంగా ఉండండి

ఫోన్ లేదా టీవీ చూస్తూ తినే అలవాటును మానేయాలి. ఆహారం రుచి, సువాసనను ఆస్వాదిస్తూ భోజనం చేయడం శారీరక, మానసిక ఆరోగ్యానికి మేలు చేస్తుంది.





### బుజిలీ మహంకాళికి
## 'గోల్కొండ జగదాంబికా' పట్టు వస్త్రాల సమర్పణ

**రాజేంద్రనగర్, ముద్ర ప్రతినిధి:**

గోల్కొండ జగదాంబికా అమ్మవారి పని వృత్తి వార్లు తమ మొక్కులు చెల్లించుకున్నారు. తెలంగాణ బోనాల సందర్భంగా గోల్కొండ జగదాంబికా అమ్మవారి పని వృత్తి వార్లు ప్రతి సంవత్సరం నగరంలోని ప్రముఖ ఆలయాల్లో అమ్మవారి తరపున పట్టు వస్త్రాలు సమర్పించడం ఆనవాయితీగా వస్తుంది. ఇందులో భాగంగా తెలంగాణ బోనాల ఉత్సవాలు ప్రారంభించిన సందర్భంగా మొదటి పూజలు అందుకునే లంగర్ హౌస్ లోని బుజిలి మహంకాళి అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించారు.

పనివృత్తి వార్ల సంఘం అధ్యక్షులు బైండ్ల శివశంకర్ ఆధ్వర్యంలో బుజిలి మహంకాళి కి ఒడి బియ్యం నింపి, పట్టు వస్త్రాలను సమర్పించారు.

అనంతరం బుజిలి మహంకాళి చైర్మన్ భోగి బాల్ రాజ్ బోనాల ఉత్సవాలు నిర్వహించే పనివృత్తి వార్లను ఘనంగా సన్మానించారు.

## బోనం సమర్పించిన ఏసీపీ సయ్యద్ ఫయాజ్

**రాజేంద్రనగర్, ముద్ర ప్రతినిధి:**



పోలీసుల బోనాల వేడుకలు కన్నుల పండుగగా జరిగాయి. గోల్కొండ ఏసిపి సయ్యద్ ఫయాజ్ గురువారం గోల్కొండ జగదాంబ వారికి బోనాలు, పట్టు వస్త్రాలు సమర్పించారు. గత సంవత్సరం కూడా గోల్కొండ ఏసీబీ పరిధిలోని అన్ని పోలీస్ స్టేషన్లో అధికారులు, సిబ్బందితో పోలీసుల బోనాల ఉత్సవాలు నిర్వహించామని ఏసిపి సయ్యద్ ఫయాజ్ అన్నారు. ఈరోజు అమ్మవారి ఏడవ పూజ సందర్భంగా డప్పు వాయిద్యాలు, పోతరాజులు, బోనాలతో ఊరేగింపుగా వచ్చి అమ్మవారికి ముక్కులు తీర్చుకున్నామన్నారు. ఈ పూజల్లో గోల్కొండ ఇన్స్పెక్టర్ సైదులు తదితరులు ఉన్నారు.

## బోనాల చెక్కులు పంపిణీ

**ముద్ర కాప్రా :**



ఉప్పల్ నియోజకవర్గంలోని వివిధ ఆలయాలకు తెలంగాణ ప్రభుత్వం మంజూరు చేసిన బోనాల చెక్కులను గురువారం హబ్సిగూడలోని శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయంలో పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ముఖ్య అతిథిగా పాల్గొనగా, ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అధ్యక్షత వహించారు.

ఈ సందర్భంగా ఆలయ కమిటీ ప్రతినిధులకు బోనాల చెక్కులను అందజేసి, ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తామని బోనాల పండుగను ఘనంగా నిర్వహించేందుకు ప్రభుత్వం అన్ని విధాలుగా సహకరిస్తోందని తెలిపారు. ఉప్పల్ నియోజకవర్గంలోని అన్ని ఆలయాల పట్ల తాను ప్రత్యేక శ్రద్ధ చూపు తున్న అని ఆలయాల అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పనకు అవసరమైన చర్యలు కొనసాగుతాయని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, పార్టీ నాయకులు, అధికారులు, పాల్గొన్నారు.

## తల్లిపాలే శిశువుకు తొలి రక్షణ

**- తల్లిపాల వారోత్సవాల అవగాహన ర్యాలీ**

**ముద్ర ప్రతినిధి, నాగర్ కర్నూల్**




ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా ప్రభుత్వ మెడికల్ కళాశాల, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, ప్రభుత్వ సాధారణ ఆసుపత్రి, ఎం.పి.ఆర్. ట్రస్ట్, జిల్లా రెడ్ క్రాస్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (బాలుర) నుంచి ట్యాంక్ బండ్ వరకు సాగిన ర్యాలీలో తల్లిపాల వల్ల శిశువులకు కలిగే ఆరోగ్య ప్రయోజనాలపై అవగాహన కల్పించారు.

ర్యాలీలో ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్, మున్సిపల్ చైర్మన్ తీగల సురేంద్ర, వైద్యాధికారులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు, ఆశా కార్యకర్తలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. తల్లిపాలే శిశువుకు తొలి ఆహారం, తొలి రోగనిరోధక శక్తి, తొలి రక్షణ అని పేర్కొంటూ ప్రతి కుటుంబంలో తల్లిపాల ప్రాముఖ్యతను చాటాలని నిర్వాహకులు పిలుపునిచ్చారు.

## రాజకీయ పార్టీల సూచనల మేరకే ఓటర్ల జాబితాలో మార్పులు

**- ఈఆర్వో నారాయణ్ అమిత్**

**ముద్ర, శేరిలింగంపల్లి:**




ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులు రాజకీయ పార్టీల నుంచి వచ్చే విలువైన సూచనల ఆధారంగానే చేపడతామని శేరిలింగంపల్లి ఈఆర్వో నారాయణ్ అమిత్ తెలిపారు. శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ ఆధ్వర్యంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆగస్టు 10తో ముగియనున్న ఎస్ఐఆర్ ప్రక్రియపై సమీక్ష నిర్వహించిన ఆయన, ఓటరు నమోదు, సవరణల ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేలా, ఎలాంటి తప్పులు లేని పారదర్శక ఓటర్ల జాబితా రూపొందించేందుకు రాజకీయ పార్టీలు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని కోరారు.

# ఘనంగా ప్రొఫెసర్ జయశంకర్ జయంతి ఉత్సవాలు










**- తెలంగాణ జన సమితి, విద్యావంతుల వేదిక ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఘన నివాళులు**

**ముద్ర ప్రతినిధి, తాండూర్.**

ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ 92వ జయంతి సందర్భంగా తాండూర్‌లోని ఇందిరా చౌక్‌లో ఉన్న ఆయన విగ్రహానికి తెలంగాణ జనసమితి, తెలంగాణ విద్యావంతుల వేదిక, ప్రజాసంఘాలు, ఉద్యమకారులు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జీవితాన్ని అంకితం చేసిన మహనీయుడు జయశంకర్ అని కొనియాడారు. ఆయన ఆశయాలు యువతకు చేరేలా ప్రభుత్వం విస్తృత కార్యక్రమాలు చేపట్టాలని, తెలంగాణ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పాలన సాగాలని కోరారు.

ఈ కార్యక్రమంలో మున్సిపల్ సానిటరీ ఇన్స్పెక్టర్ రాములు, జన సమితి నాయకులు, తెలంగాణ విద్యావంతుల వేదిక నాయకులు, అధ్యాపకులు, ఉద్యమకారులు, మున్సిపల్ సిబ్బంది ప్రజాసంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

### తెలంగాణ ఉద్యమానికి వెన్నెముక ఆచార్య జయశంకర్: కలెక్టర్ నారాయణరెడ్డి

**(ముద్ర ప్రతినిధి, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా):**

తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జీవితాన్నే అంకితం చేసిన మహనీయుడు ఆచార్య కొత్తపల్లి జయశంకర్ అని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి. నారాయణరెడ్డి అన్నారు. జయశంకర్ 92వ జయంతి సందర్భంగా సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, తెలంగాణ ఉద్యమానికి జయశంకర్ సిద్ధాంత బలాన్ని అందించి, రాష్ట్ర సాధనలో కీలక పాత్ర పోషించారని కొనియాడారు. ఆయన ఆశయాలు, ఆదర్శాలను ప్రతి ఒక్కరూ అనుసరిస్తూ రాష్ట్ర అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమ అధికారి కేశురాం, కలెక్టరేట్ ఏఓ సునీల్ కుమార్, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు, జిల్లా సంక్షేమ అధికారి శాంతిశ్రీ, వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### జయశంకర్ సర్ సేవలు చిరస్మరణీయం

**- జోనల్ కమిషనర్**

**ముద్ర, శేరిలింగంపల్లి:**

తెలంగాణ సాధన కోసం జరిగిన ఉద్యమంలో దివంగత ఆచార్య ప్రొఫెసర్ జయశంకర్ సర్ అందించిన మేధోపరమైన, సిద్ధాంతపరమైన సేవలు చిరస్మరణీయమని శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ నారాయణ్ అమిత్ కొనియాడారు. జయశంకర్ సర్ జయంతి వేడుకలను శేరిలింగంపల్లి జోనల్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఛిత్ర పటానికి పూలమాల వేసి నివాళర్పించిన జోనల్ కమిషనర్ నారాయణ్ అమిత్ మాట్లాడుతూ ఆయన ఆశయాలకు అనుగుణంగా ప్రజలకు మెరుగైన సేవలు అందించడానికి ప్రతి ఒక్క అధికారి, సిబ్బంది బాధ్యతాయుతంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ గారితో పాటు శేరిలింగంపల్లి జోన్ మరియు సర్కిల్ పరిధిలోని ఉన్నతాధికారులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొని నివాళులర్పించారు.

### శంకర్ పల్లిలో..

**ముద్ర, శంకర్ పల్లి:**

తెలంగాణ సిద్ధాంత కర్త ఆచార్య జయశంకర్ జయంతి సందర్భంగా శంకర్ పల్లి పురపాలీక కార్యాలయంలో పురపాలిక ఛైర్మెన్ సాత ప్రవీణ్ కుమార్ నివాళులు అర్పించారు. కమిషనర్ యోగేష్, వైస్ చైర్మన్ శ్వేతా పాండురంగారెడ్డి,కౌన్సిలర్ గిరిజ శేఖర్, కో ఆప్షన్ సభ్యులు బాలకృష్ణ రెడ్డి, మహమ్మద్,మునిసిపల్ సిబ్బంది పాల్గొన్నారు.




# రూ.90 లక్షల మోసం కేసు నమోదు

**- మహిళపై నార్సింగ్ పోలీసుల కేసు**

**ముద్ర, రాజేంద్రనగర్, ఆగస్టు 6:**

పెట్టుబడిపై అధిక లాభాలు వస్తాయని నమ్మించి రూ.90 లక్షలు తీసుకుని తిరిగి చెల్లించకుండా మోసానికి పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న మణికొండకు చెందిన పట్లోళ్ల రూపా రెడ్డిపై నార్సింగ్ పోలీసులు కేసు నమోదు చేశారు. శంకర్‌పల్లి మండలం మోకిల గ్రామానికి చెందిన చింతపల్లి రాణి ఫిర్యాదు మేరకు భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్) సెక్షన్లు 316(2), 318(4), 351(2) కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఫిర్యాదు ప్రకారం, 2021లో పరిచయమైన రూపా రెడ్డి అత్యవసర అవసరాల పేరుతో విడతల వారీగా రూ.90 లక్షలు తీసుకున్నారని, డబ్బు తిరిగి ఇవ్వాలని కోరగా బాండ్ రాసిచ్చి, అనంతరం ఇచ్చిన రూ.1 కోటి చెక్కు నిధుల లేమితో బౌన్స్ అయిందని పేర్కొన్నారు. తర్వాత ఇచ్చిన మరో రెండు చెక్కులను కూడా నగదుగా మార్చుకోవద్దని కోరుతూ తప్పించుకుంటూ వచ్చారని ఆరోపించారు. ఇటీవల డబ్బు కోసం వెళ్లగా దుర్భాషలాడి బెదిరింపులకు పాల్పడినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు.


నిశ్చితార్థం ఫొటో (ఫైల్)



మీడియాతో మాట్లడుతున్న సంతోష్ గౌడ్

ఇదిలా ఉండగా, ఈ వ్యవహారంపై ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ కుమారుడు సంతోష్ గౌడ్ స్పందిస్తూ, రూపా రెడ్డి కుటుంబంపై జరుగుతున్న చర్యల వెనుక తన తండ్రి కుట్ర ఉందని ఆరోపించారు. తాను, రూపా రెడ్డి కుమార్తె పరస్పర అంగీకారంతో నిశ్చితార్థం చేసుకున్నామని, ఈ వివాహం ఇష్టం లేకే దాడులు, కేసులు జరుగుతున్నాయని అన్నారు. మరోవైపు ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ ఈ ఆరోపణలను తోసిపుచ్చుతూ, డబ్బుల వివాదం సంబంధిత వ్యక్తులే పరిష్కరించుకోవాలని, సంతోష్ గౌడ్‌తో తనకు ఎలాంటి సంబంధం లేదని వ్యాఖ్యానించారు.

అయితే రూపా రెడ్డి ఈ సంర్భంగా మాట్లడుతూ పిల్లలు ఇష్టపడ్డారు, మనం కాదంటే వారు ఎక్కడికో వెళ్ళిపోయి పెళ్లి చేసుకుంటారు. ప్రకాష్ అన్న పెద్ద మనసుతో పిల్లలను దీవించుదాం అని వేడుకుంటోంది.

## ఆర్‌యూబీ పనులకు శ్రీకారం

**ముద్ర మల్కాజిగిరి:**

నేరేడ్మెట్‌లోని వాజ్ పేయి నగర్ రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణ పనులను ప్రారంభించిన సందర్భంగా బీజేపీ నాయకులు ప్రధాని నరేంద్ర మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున బీజేపీ శ్రేణులు పాల్గొని మిఠాయిలు పంచుకుని టపాకాయలు కాలుస్తూ సంబరాలు నిర్వహించారు. దశాబ్దాలుగా ఈ ప్రాంతంలో రైల్వే గేట్లు తరచూ మూసివేయబడుతూ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని నాయకులు పేర్కొన్నారు. మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ చొరవతో కేంద్ర రైల్వే శాఖ సుమారు రూ.75 కోట్ల వ్యయంతో ఆర్‌యూబీ నిర్మాణ పనులను ప్రారంభించిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు తాడూరు శ్రీనివాస్, అంజలీదేవి, మాజీ కార్పొరేటర్లు సునీత యాదవ్, శ్రవణ్, ప్రసన్న కుమారి, శ్రీనివాస్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

### ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు సహాయ సహకారాలు

**- పురపాలక చైర్మన్ సాత ప్రవీణ్ కుమార్**

**ముద్ర శంకర్ పల్లి,**

ప్రభుత్వ పాఠశాల లో మౌలిక సదుపాయల కల్పనకు తనవంతు సహకారం అందిస్తానని శంకర్ పల్లి పురపాలిక చైర్మెన్ సాతా ప్రవీంకుమార్ అన్నారు పురపాలికలోని 15వ వార్డు అయ్యప్ప రెడ్డి గూడ ప్రాథమిక పాఠశాలకు గురువారం ఆయన ఆరు సీలింగ్ ఫ్యాన్స్, విద్యార్థులకు స్కూల్ షూస్ అందజేశారు.

ఈ కార్యక్రమంలో నాయకులు పాండురంగారెడ్డి, బాలకృష్ణారెడ్డి మహేష్, హెచ్ఎం సదాలక్ష్మి, ఉపాధ్యాయులు తహర్ అలీ, సునీత పాల్గొన్నారు.

# నకిలీ కరెన్సీ ముఠా గుట్టురట్టు.. ఏడుగురి అరెస్ట్

**ముద్ర ప్రతినిధి, నాగర్ కర్నూల్, ఆగస్టు 6:**




నకిలీ కరెన్సీ నోట్లను తయారు చేసి చలామణి చేస్తున్న అంతర్‌జిల్లా ముఠాను బిజినపల్లి పోలీసులు ఛేదించారు. ఈ కేసులో ఏడుగురు నిందితులను అరెస్టు చేసి, వారి వద్ద నుంచి రూ.68 వేల విలువైన నకిలీ రూ.500 నోట్లు, హెచ్‌పీ కలర్ జిరాక్స్ యంత్రం, కరెన్సీ కౌంటింగ్ మిషన్, ప్రత్యేక కాటన్ లినెన్ పేపర్లు, ప్రింటింగ్ సామగ్రి, 7 మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు నాగర్‌కర్నూల్ డీఎస్పీ బూరి శ్రీనివాస్ తెలిపారు.

మంగానూరు గ్రామంలోని ఓ వైన్స్‌లో నకిలీ రూ.500 నోటుతో కొనుగోలు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు, బొల్ల కురుమూర్తి ఇంటిపై దాడి చేసి నిందితులను పట్టుకున్నారు. ప్రధాన నిందితుడు కలిదిండి నాగరాజు ఆర్థిక ఇబ్బందుల కారణంగా నకిలీ కరెన్సీ ముద్రించి, ఇన్‌స్టాగ్రామ్ ద్వారా ఏర్పడిన పరిచయాలతో స్థానిక దాబాలు, కిరాణా దుకాణాలు, పెట్రోల్ బంకుల్లో చలామణి చేసినట్లు విచారణలో వెల్లడైంది.

ఈ కేసులో మరో నిందితుడు పరారీలో ఉండగా, పోలీసులు కేసు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

## ఆర్యవైశ్య మహాసభ రాజకీయ కమిటీ రాష్ట్ర వైస్ చైర్మన్ గా కంచర్ల వెంకటేష్ గుప్తా

**రాజేంద్రనగర్, ముద్ర ప్రతినిధి:**

ఆర్యవైశ్యులు కేవలం వ్యాపారంలోనే రాణించడం కాదని, రాజకీయంగా కూడా అందరూ ముందుకు వచ్చి ఎదగాలని ఆర్యవైశ్య మహాసభ రాజకీయ కమిటీ నూతన వైస్ చైర్మన్ కంచర్ల వెంకటేష్ గుప్తా అన్నారు. లంగర్ హౌస్ కు చెందిన వెంకటేష్ గుప్తను తెలంగాణ ఆర్యవైశ్య మహాసభ రాజకీయ కమిటీ వైస్ చైర్మన్ గా నియమించారు. 2026–28 సంవత్సరాలకు గాను ఆయనను రాష్ట్ర వైస్ చైర్మన్ గా నియమిస్తూ అధ్యక్షులు అమరవాది లక్ష్మీనారాయణ నియామక పత్రాన్ని అందించారు. ఈ సందర్భం గా వెంకటేష్ గుప్తా మాట్లాడుతూ... ఆర్య వైశ్యులు రాజకీయంగా ఎదిగేందుకు కృషి చేస్తానని అన్నారు.



సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
శుక్రవారం 07.08.2026
www.mudranews.in | @mudranews



**ఉదయాన్ని ఫోన్‌తో కాదు..
మంచం సర్దడంతో ప్రారంభించండి**

నిద్రలేచిన వెంటనే మంచాన్ని శుభ్రంగా సర్దుకోవడం చిన్న విజయానుభూతిని కలిగిస్తుంది. రోజంతా క్రమశిక్షణతో, ఉత్సాహంగా ఉండేందుకు ఇది మంచి అలవాటని నిపుణులు చెబుతున్నారు.



# కరీంనగర్ సమగ్ర అభివృద్ధే లక్ష్యం

**- రాష్ట్ర ఉన్నతాధికారులతో మేయర్ శ్రీనివాస్ సమావేశాలు**



**ముద్ర, కరీంనగర్** : కరీంనగర్ నగరాన్ని ఆధునిక, ప్రణాళికా బద్ధమైన నగరంగా తీర్చిదిద్దే లక్ష్యంతో మేయర్ కొలగాని శ్రీనివాస్ హైదరాబాద్‌లో మున్సిపల్ పరిపాలన శాఖ ప్రధాన కార్యదర్శి, సీడీఎంఏ డా. టి.కె. శ్రీదేవి, డీటీసీపీ, ఈఎన్‌సీ తదితర ఉన్నతాధికారులతో సమావేశమయ్యారు.ఈ సందర్భంగా నగర అభివృద్ధికి అవసరమైన ప్రత్యేక నిధులు, పరిపాలనా అనుమతులు, సాంకేతిక సహకారం అందించాలని కోరారు. ఆర్‌అండ్‌బీ రోడ్ల మరమ్మతులు, తీగలగుట్టపల్లి రైల్వే ఓవర్‌బ్రిడ్జి, విలీన గ్రామాల అభివృద్ధి, సీసీ రోడ్లు, డ్రైనేజీలు, తాగునీటి పైప్‌లైన్లు, స్టార్మ్‌వాటర్ డ్రైనేజీ, వరద నివారణ చర్యలు, స్మార్ట్ సిటీ పనులు, ట్రాఫిక్ నిర్వహణ, పట్టణ సుందరీకరణ వంటి అంశాలను ప్రస్తావించారు.

టౌన్ ప్లానింగ్, ఇంజినీరింగ్ విభాగాల్లో ఖాళీ పోస్టులను భర్తీ చేయడంతో పాటు అక్రమ నిర్మాణాల నియంత్రణ, సమగ్ర మాస్టర్ ప్లాన్ అమలు, విలీన గ్రామాలకు ప్రత్యేక నిధుల కేటాయింపుపై కూడా విజ్ఞప్తి చేశారు. మేయర్ సమర్పించిన ప్రతిపాదనలను అధికారులు సానుకూలంగా స్వీకరించి, సంబంధిత శాఖల సమన్వయంతో ప్రాధాన్యతా పనులను వేగవంతం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సమావేశాలు కరీంనగర్ నగర భవిష్యత్ అభివృద్ధికి కీలక మలుపుగా నిలుస్తాయని, ప్రజల ఆశలకు అనుగుణంగా అన్ని శాఖల సమన్వయంతో అభివృద్ధి కార్యక్రమాలను మరింత వేగవంతం చేయనున్నట్లు మేయర్ శ్రీ కొలగాని శ్రీనివాస్ గారు తెలిపారు.

# దొంగతనాలు అరికట్టేందుకు చెక్ పోస్టులు

**24 గంటల పాటు నిరంతర నిఘా
ముద్ర వార్తకు స్పందన**



**ముద్ర ప్రతినిధి, నిర్మల్:** నిర్మల్ జిల్లాలో గత నెల రోజులుగా కంటి మీద కునుకు లేకుండా ప్రజలను వణికిస్తున్న దొంగతనాలు అరికట్టేందుకు పోలీసు శాఖ నడుం బిగించింది. గత నెల 12న "వణికిస్తున్న వరుస దొంగతనాలు" వార్త నేపథ్యంలో పట్టణ నలుదిక్కులా చెక్ పోస్టులను ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టారు. తన్వి అపార్ట్మెంట్, హరిహరక్షేత్రం తదితర ప్రాంతాల్లో భారీగా దోపిడీ జరిగిన నేపథ్యంలో దిద్దుబాటు చర్యలు చేపట్టింది. దొంగతనాలు మరియు ఇతర నేరాలను అరికట్టడంతో పాటు ప్రజలకు మరింత భద్రత కల్పించేందుకు ఎస్పీ డా. జి. జానకి శర్మిల ఆదేశాల మేరకు నిర్మల్ పట్టణ పరిధిలోని కీలక ప్రాంతాల్లో 7 ప్రత్యేక చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి 24 గంటల పాటు నిరంతర నిఘా, తనిఖీలు నిర్వహించను న్నారు. దొంగతనాలకు పాల్పడే వ్యక్తుల కదలికలను నియంత్రించడంతో పాటు అనుమానాస్పద వ్యక్తులు, వాహనాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయనున్నారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో పోలీసుల పెట్రోలింగ్‌ను ముమ్మరం చేసి, అనుమానాస్పద వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేయనున్నారు.

**చెక్‌పోస్టులు ఏర్పాటు చేసిన ప్రాంతాలు:**

గాజులపేట్ రోడ్డు, సెయింట్ థామస్ స్కూల్, సిద్ధాపూర్, సోఫీ నగర్ దర్గా, మహాలక్ష్మి ఆలయం, వైఎస్ఆర్ కాలనీ రోడ్, మంజులాపూర్ లలో ఏర్పాటు చేస్తున్న ఈ చెక్‌పోస్టుల వద్ద 24 గంటల పాటు పోలీస్ సిబ్బంది విధుల్లో ఉండి వాహనాల తనిఖీలు, అనుమానాస్పద వ్యక్తుల కదలికలపై నిఘా కొనసాగిస్తారు. అదేవిధంగా పట్టణంలోని ముఖ్యమైన ప్రాంతాల్లో రాత్రి వేళల్లో ప్రత్యేక పెట్రోలింగ్ నిర్వహిస్తూ నేరాల నియంత్రణకు చర్యలు తీసుకోనున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ జానకి షర్మిల మాట్లాడుతూ దొంగతనాలు, ఇతర నేరాలకు పాల్పడే వ్యక్తులకు ఎలాంటి అవకాశం లేకుండా పోలీస్ శాఖ అప్రమత్తంగా వ్యవహరిస్తుందని తెలిపారు. ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ నేరాల నియంత్రణకు అవసరమైన అన్ని చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు.

**ప్రజలు పోలీసులకు సహకరించాలి**

ప్రజలు తమ పరిసరాల్లో అనుమానాస్పద వ్యక్తులు, వాహనాలు లేదా అనుమానాస్పద కార్యకలాపాలు గుర్తించినట్లయితే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ఎస్పీ డా. జి. సూచించారు.

## నెరవేరిన 'బతుకమ్మ ఘాట్' రహదారి కల

**- రూ.30 లక్షల ఉపాధి హామీ నిధులతో సీసీ రోడ్ల నిర్మాణం**



**ముద్ర చిగురుమామిడి:** మండలంలోని సుందరగిరి గ్రామంలో బతుకమ్మ ఆటస్థలం వరకు వెళ్లే రోడ్డు తో పాటు ఇప్పలపల్లె నుండి వెళ్లే మార్గాల్లో దశాబ్దాలుగా ఉన్న రోడ్డు సమస్యకు ఎట్టకేలకు పరిష్కారం లభించింది. రూ.30 లక్షల జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో చేపట్టిన రెండు సీసీ రోడ్ల నిర్మాణం పూర్తయింది. ఈ రోడ్ల నిర్మాణం పట్ల గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.ఈ సందర్భంగా సర్పంచ్ జంగ శిరీష రమణారెడ్డి మాట్లాడుతూ.. తన హయాంలో గ్రామానికి ఎంతో కీలకమైన ఈ రెండు సీసీ రహదారుల నిర్మాణం పూర్తి కావడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. నూతనంగా నిర్మించిన రహదారుల వల్ల బతుకమ్మ పండుగ సమయంలో మహిళలకు రవాణా కష్టాలు తీరడం తో పాటు, నిత్యం పొలాలకు వెళ్లే రైతులకు, మత్స్యకారులకు, గౌడ కార్మికులకు ఎంతో సౌకర్యవంతంగా ఉంటుందని తెలిపారు. సుందరగిరి దశాబ్దాల కలను గుర్తించి, రోడ్ల నిర్మాణానికి రూ.30 లక్షల నిధులు మంజూరు చేయించిన రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు గ్రామం తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ జంగ రమణారెడ్డి, ఉప సర్పంచ్ మెడబోయిన రాజు, వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శి సంపత్, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమ దిక్సూచి జయశంకర్

**బిజెపి జిల్లా అధ్యక్షులు సాయిని మల్లేశం**



**ముద్ర, కరీంనగర్ :** తెలంగాణ సిద్ధాంతకర్త, ప్రత్యేక రాష్ట్ర సాధన ఉద్యమ దిక్సూచి ప్రొఫెసర్ జయశంకర్ అని బిజెపి జిల్లా అధ్యక్షులు సాయిని మల్లేశం కొనియాడారు. బిజెపి జిల్లా శాఖ ఆధ్వర్యంలో గురువారం రోజున ప్రొఫెసర్ జయశంకర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా టవర్ సర్కిల్లోని ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహం వద్ద బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయి ని మల్లేశం, బిజెపి నాయకులు కార్యకర్తలు కలిసి ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సాయిని మల్లేశం మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రొఫెసర్ జయశంకర్ జీవితాంతం పడిన తపన, అందించిన మార్గదర్శకత్వం ఎప్పటికీ మరువలేనివని కొనియాడారు. మాజీ డిప్యూటీ మేయర్ గుగ్గిల రమేష్, కార్పొరేటర్ వంగల పవన్, వాసల రమేష్ , చంద్రశేఖర్, జితేందర్,కో ఆప్షన్ బల్విందర్ సింగ్,కన్నె కృష్ణ.కటకం లోకేష్, గొట్టిముక్కుల రమణ, నాంపల్లి శ్రీనివాస్,బంగారు రాజేంద్రప్రసాద్, గుజ్జేటి శివ , ఉప్పరపెల్లి శ్రీనివాస్, ఆడిచర్ల రాజు, తనకు సాయికృష్ణ, పాదం శివరాజ్, దేవరకొండ అజయ్ , తదితరులు పాల్గొన్నారు..

## జన్మదినాన కేటీఆర్‌ను కలిసిన సర్దార్ రవీందర్ సింగ్



**ముద్ర, కరీంనగర్** : కరీంనగర్ మాజీ మేయర్, రాష్ట్ర సివిల్ సప్లయ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్, 58వ డివిజన్ కార్పొరేటర్ సర్దార్ రవీందర్ సింగ్ తన జన్మదినం సందర్భంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావును మర్యాదపూర్వకంగా కలిసి ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా కేటీఆర్‌కు శుభాకాంక్షలు తెలిపిన సర్దార్ రవీందర్ సింగ్, పార్టీ బలోపేతం కోసం కృషి చేస్తామని పేర్కొన్నారు. ప్రజాసేవ, సామాజిక సేవా కార్యక్రమాల ద్వారా గుర్తింపు పొందిన సర్దార్ రవీందర్ సింగ్‌కు కేటీఆర్ జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసి, ఆయన మరిన్ని సేవా కార్యక్రమాలు కొనసాగించాలని ఆకాంక్షించారు.

## రైతులకు ట్రాన్స్‌ఫార్మర్ సేవలు ఉచితం: ఎస్ఈ రవీందర్



**ముద్ర, కరీంనగర్** : రైతులకు నాణ్యమైన, అంతరాయం లేని విద్యుత్ సరఫరా అందించేందుకు కరీంనగర్ సర్కిల్ పరిధిలో 12 డిపార్ట్మెంట్ వాహనాలను అందుబాటులో ఉంచినట్లు సూపరింటెండింగ్ ఇంజనీర్ ఆర్. రవీందర్ తెలిపారు. ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయిన వెంటనే అధికారులకు సమాచారం అందిస్తే, శాఖ వాహనాల ద్వారానే ఉచితంగా తరలింపు, లోడింగ్–అన్‌లోడింగ్, మరమ్మతులు లేదా ప్రత్యామ్నాయ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేస్తామని చెప్పారు. రైతులు ఎలాంటి రవాణా లేదా లోడింగ్ ఖర్చులు చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. ట్రాన్స్‌ఫార్మర్ సమస్యలపై వెంటనే 1912కు ఫిర్యాదు చేయాలని సూచించారు.

## ప్రొఫెసర్ జయశంకర్ కు ఘనంగా నివాళులు



**ముద్ర ప్రతినిధి, నిర్మల్:** తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ 92వ జయంతిని పురస్కరించుకుని నిర్మల్ జిల్లా కలెక్టరేట్, పురపాలక సంఘ కార్యాలయాల్లో ఘనంగా నివాళులర్పించారు. కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్ అధికారులతో కలిసి జయశంకర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. అలాగే పురపాలక సంఘ కార్యాలయంలో మున్సిపల్ వైస్ చైర్మన్ అప్పాల గణేష్ చక్రవర్తి జయశంకర్ చిత్రపటానికి నివాళులర్పించి, ఆయన ఆశయాలు భావితరాలకు స్ఫూర్తిగా నిలుస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ యం. రవిబాబు, మేనేజర్ మారుతీ, ఏఈ శేఖర్, పర్యావరణ అధికారి రజిని,కౌన్సిలర్లు,మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

## గడి మైసమ్మ ఆలయ నిర్మాణానికి శ్రీకారం

**బోనాలతో ప్రత్యేక పూజలు నిర్వహించిన భాజపా శ్రేణులు....**



**ముద్ర, కోరుట్ల;** కోరుట్ల పట్టణంలోని చారిత్రక గడిబురుజులు, మెట్ల బావి కోనేరు ప్రాంతంలో గడి మైసమ్మ తల్లి ఆలయ నిర్మాణానికి బీజేపీ ధార్మిక విభాగం ఆధ్వర్యంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. గొర్రె పొట్టేలు, బోనాలతో డప్పు చప్పుళ్ల మధ్య జరిగిన ఊరేగింపులో మహిళలు, యువకులు, ప్రజాసంఘాలు, కుల సంఘాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. డా. పేట భాస్కర్ , బీజేపీ పట్టణ అధ్యక్షుడు, కౌన్సిలర్ కస్తూరి లక్ష్మీనారాయణ, బీజేపీ ఎండోమెంట్ ధార్మిక సెల్ జిల్లా కన్వీనర్ మాడవేణి నరేష్–స్వప్న, జిల్లా కార్యదర్శి సుదవేణి మహేష్ బీజేపీ నాయకులు, ధార్మిక విభాగం ప్రతినిధులు, వివిధ కుల సంఘాల నాయకులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## కాగిత రహిత విధానంలోనే బిల్లులు సమర్పించాలి

**ముద్ర ప్రతినిధి, నిర్మల్:** రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా తీసుకొచ్చిన కాగిత రహిత విధానంలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా ఐఎఫ్ఎంఎస్ ద్వారా పేపర్‌లెస్ బిల్లుల సమర్పణ విధానాన్ని అమలు చేయాలని నిర్ణయించిందని జిల్లా ఖజానా అధికారి సరోజ ఒక ప్రకటనలో తెలిపారు

## స్థలాల పరిశీలనతోనే ముగిసిన ఎంపీవో విచారణ

**రికార్డుల జోలికి వెళ్లలేదని ఫిర్యాదుదారుల ఆగ్రహం**

**ముద్ర, చిగురుమామిడి:** జిల్లా పంచాయతీ అధికారి (డీపీఓ) ఆదేశాల మేరకు రేకొండ గ్రామపంచాయతీలో ప్రభుత్వ నిధుల దుర్వినియోగం, అక్రమాలపై వచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో చిగురుమామిడి మండల పంచాయతీ అధికారి (ఎంపీవో) కిరణ్ కుమార్ గురువారం క్షేత్రస్థాయి విచారణ నిర్వహించారు.విచారణలో భాగంగా ఫిర్యాదులో ప్రస్తావించిన వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయం సమీపంలోని బోరు, చెరువు కట్ట వద్ద మొక్కల ధ్వంసం, కాల్చిన చెట్లు తొలగింపు పేరుతో చేపట్టిన పనులను పరిశీలించారు.అయితే, గ్రామపంచాయతీ తీర్మానాలు, బిల్లులు, వౌచర్లు, మెజర్‌మెంట్ బుక్స్ (ఎంబీ), బ్యాంకు లావాదేవీలు, అనుమతి పత్రాలు తదితర కీలక రికార్డులను పరిశీలించకుండా విచారణను ముగించారని ఫిర్యాదుదారులు ఆరోపించారు. కేవలం క్షేత్రస్థాయి పరిశీలనకే పరిమితమై, రికార్డుల ఆధారంగా సమగ్ర విచారణ చేపట్టలేదని వారు పేర్కొన్నారు.అలాగే, విచారణ అనంతరం ఎలాంటి నివేదికను అందించకుండా, "20 రోజుల తర్వాత నివేదిక ఇస్తాం" అని మౌఖికంగా మాత్రమే తెలిపారని ఫిర్యాదుదారులు ఆరోపించారు. దీంతో విచారణ పారదర్శకతపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయని అన్నారు. ఈ నేపథ్యంలో సంబంధిత అన్ని రికార్డులను స్వాధీనం చేసుకుని, జిల్లా స్థాయి ఉన్నతాధికారులతో సమగ్ర, నిష్పక్షపాత విచారణ నిర్వహించాలని, అక్రమాలు రుజువైతే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదుదారులు డిమాండ్ చేశారు.

**ఎంపీవో వివరణ**

ఈ విషయంపై చిగురుమామిడి ఎంపీవో కిరణ్ కుమార్‌ను వివరణ కోరగా, రేకొండ గ్రామాన్ని విచారణ నిమిత్తం సందర్శించినట్లు తెలిపారు. ఫిర్యాదుకు సంబంధించిన రికార్డులను పరిశీలించడంతో పాటు సంబంధిత వ్యక్తుల వాంగ్మూలాలను కూడా నమోదు చేసినట్లు వెల్లడించారు. విచారణకు సంబంధించిన సమగ్ర నివేదికను సిద్ధం చేసి జిల్లా అధికారులకు సమర్పిస్తామని ఆయన స్పష్టం చేశారు.

# ఏసీబీ వలలో అవినీతి చేప

**పేరు మార్చేందుకు లంచం తీసుకుంటూ దొరికిన అధికారి**

**ముద్ర, కోరుట్ల;** పేరు సరిచేసేందుకు లంచం డిమాండ్ చేసిన ఓ గ్రామ పరిపాలనా అధికారి (జీపీవో) అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులకు చిక్కాడు. జగిత్యాల జిల్లా మెట్‌పల్లి మండలం ఆత్మకూరు గ్రామ పంచాయతీలో ఈ సంఘటన చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం ఆత్మకూరు గ్రామ పంచాయతీ పరిధిలోని బాధితుడు మల్లేశ్‌కు చెందిన పాస్‌బుక్‌లో పేరు తప్పుగా నమోదైంది. ఆ పేరును సరిదిద్దాల్సిందిగా కోరగా, జీపీవో రాజేశ్ రూ.5,000 లంచం డిమాండ్ చేశాడు. లంచం ఇవ్వడం ఇష్టం లేని మల్లేశ్ ఏసీబీ అధికారులను ఆశ్రయించి ఫిర్యాదు చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు రసాయనాలతో కూడిన నగదును మల్లేశ్ నుంచి రాజేశ్ తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు పక్కా ప్రణాళికతో దాడులు చేసి రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అధికారిని అదుపులోకి తీసుకున్న ఏసీబీ బృందం, కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు వెల్లడించింది.



# సేంద్రియ వ్యవసాయానికి ప్రభుత్వం పెద్దపీట

**పంట మార్పిడిపై రైతులకు అవగాహన కల్పించాలి
రైతు సంక్షేమ కమిషన్ రాష్ట్ర చైర్మన్ కోదండ రెడ్డి**




**ముద్ర ప్రతినిధి, నిర్మల్:** రాష్ట్రంలో సేంద్రీయ వ్యవసాయాన్ని ప్రభుత్వం పెద్ద ఎత్తున ప్రోత్సహిస్తోందని రాష్ట్ర వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి తెలిపారు. సేంద్రీయ వ్యవసాయం, మార్కెటింగ్, ఉద్యానవన పంటల సాగుపై నిర్వహించిన సమీక్షలో ఆయన రైతులు పంట మార్పిడి విధానాలు పాటించి, రసాయనిక ఎరువుల వినియోగాన్ని తగ్గించాలని సూచించారు. సేంద్రీయ ఉత్పత్తులకు నాణ్యత పరీక్షల కోసం ప్రత్యేక విధివిధానాలు రూపొందిస్తున్నామని, రైతులకు మెరుగైన మార్కెటింగ్ సౌకర్యాలు కల్పిస్తామని చెప్పారు. భూ సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇవ్వాలని అధికారులను ఆదేశించారు.

కలెక్టర్ భవేశ్ మిశ్రా మాట్లాడుతూ జిల్లాలో వరి, మొక్కజొన్న, జొన్న, సోయా, కందులతో పాటు ఆయిల్ పామ్, పండ్లు, కూరగాయల సాగును ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం జిల్లాలో 20 వేల ఎకరాల్లో ఉద్యానవన పంటలు సాగవుతున్నాయని, అందులో 8,300 ఎకరాల్లో ఆయిల్ పామ్, 5 వేల ఎకరాల్లో పసుపు సాగు జరుగుతోందన్నారు. రెవెన్యూ మ్యాపులు లేని గ్రామాల్లో భూ సర్వేలు కొనసాగుతున్నాయని, భూ భారతి దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నామని వెల్లడించారు.

ఈ సమావేశంలో కమిషన్ సభ్యులు రాములు నాయక్, కె.వి.ఎన్. రెడ్డి, భవానీ రెడ్డి, రామ్‌గోపాల్ రెడ్డి, సునీల్ కుమార్, గంగాధర్, అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, డి.ఎఫ్.ఓ సుశాంత్ సుఖదేవ్ బోబడే, భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్లు, అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## అల్ఫోర్స్ టైనీటాట్స్‌లో ఘనంగా గ్రీన్ కార్నివల్

**ముద్ర, కరీంనగర్** : కరీంనగర్ వావిలాలపల్లిలోని అల్ఫోర్స్ టైనీటాట్స్ పాఠశాలలో గురువారం గ్రీన్ కార్నివల్‌ను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి. నరేందర్ రెడ్డి మాట్లాడుతూ చెట్లను కాపాడడం, పెంచడం ప్రతి ఒక్కరి ప్రాథమిక బాధ్యత అని, పర్యావరణ పరిరక్షణతో కాలుష్యాన్ని తగ్గించవచ్చని అన్నారు. గ్రీన్ ఎగ్జిబిషన్, వ్యర్థాలతో వినూత్న వస్తువుల తయారీ, మొక్కల ప్రదర్శన, హరిత పోస్టర్లు, పర్యావరణ ప్రతిజ్ఞ వంటి కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. విద్యార్థులు ఆకుపచ్చ దుస్తుల్లో పాల్గొని వేడుకకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.



సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
శుక్రవారం 07.08.2026
www.mudranews.in | @mudranews



## చేయాల్సిన పనుల జాబితా రాసుకోండి

రోజు చేయాల్సిన పనులను ముందుగానే రాసుకుని, పూర్తైన వాటికి గుర్తు పెట్టుకోవడం సంతృప్తిని ఇస్తుంది. ఇది పనితీరును మెరుగుపరచడంతో పాటు లక్ష్య సాధనకు దోహదపడుతుంది.







## హెచ్ఐవి ఎయిడ్స్ పై యువత అవగాహన పెంచుకోవాలి

**- ఎన్ఎస్ఎస్ ఆంధ్ర తెలంగాణ రీజనల్ డైరెక్టర్ ఆర్. సైదా నాయక్**

ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి:

హెచ్ఐవీ/ఎయిడ్స్‌పై యువత సరైన అవగాహన పెంచుకుని తగిన జాగ్రత్తలు పాటించాలని ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల ఎన్ఎస్ఎస్ రీజినల్ డైరెక్టర్ ఆర్. సైదా నాయక్ అన్నారు. శ్రీ లక్ష్మీనరసింహస్వామి డిగ్రీ కళాశాలలో నిర్వహించిన రెడ్ రిబ్బన్ క్లబ్ పీర్ లీడర్స్ అవగాహన సదస్సులో ఆయన పాల్గొని, సకాలంలో హెచ్ఐవీ పరీక్షలు చేయించుకోవడం ద్వారా ఆరోగ్యంగా జీవించవచ్చని సూచించారు. ఈ సందర్భంగా నిపుణులు హెచ్ఐవీ వ్యాప్తి మార్గాలు, నివారణ చర్యలు, చికిత్సపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. హెచ్ఐవీ పాజిటివ్‌గా నిర్ధారణ అయిన వారు వెంటనే చికిత్స ప్రారంభించి క్రమం తప్పకుండా మందులు వాడాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రమేష్ గంజి, కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు కనుక బాలరాజు, తోటకూరి రామకృష్ణ, ఎండి.అతార్ ఫరీన్, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

## రైల్వే విస్తరణలో బాధితులకు న్యాయం చేయాలి



**- ఏడీఆర్ఎంకు భూ నిర్వాసితుల వినతి**

ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి:

రాయగిరి రైల్వే స్టేషన్ విస్తరణ పనుల వల్ల ఇళ్లు కోల్పోతున్న భూ నిర్వాసితులకు తగిన నష్టపరిహారం, పునరావాసం కల్పించి న్యాయం చేయాలని సికింద్రాబాద్ అడిషనల్ డివిజనల్ రైల్వే మేనేజర్ (ఏడీఆర్ఎం) ముత్యాల నాయుడును భూ నిర్వాసితులు కోరారు. రైల్వే అభివృద్ధి పనులను పరిశీలించేందుకు వచ్చిన ఆయనకు తమ సమస్యలను వినిపించారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీటీసీ హనుమంతు నాయక్ మాట్లాడుతూ, భూ నిర్వాసితుల సమస్యలను మానవతా దృక్పథంతో పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే స్వయంభూ శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయానికి వెళ్లే మార్గం మూసుకుపోకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై స్పందించిన ఏడీఆర్ఎం ముత్యాల నాయుడు సమస్యలను పరిశీలించి, రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి తగిన న్యాయం జరిగేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో కిషోర్ నాయక్, రాకేష్ నాయక్, ఇప్ప పరుశురాం, బల్ల వీరభద్రప్ప, రవి నాయక్, ఆకుల యాదగిరి, ఆకుల ఆంజనేయులు, కాశీ విశ్వనాథ్, మహబూబ్, పాల్త్య శ్రీను నాయక్ పాల్గొన్నారు.

## గుండా సత్యనారాయణ భౌతికకాయానికి నివాళులర్పించిన మాజీ ఎమ్మెల్యే సంకినేని



ముద్ర, సూర్యాపేట, ఆగస్టు 6:

పట్టణ ప్రముఖులు గుండా సత్యనారాయణ మృతి పట్ల మాజీ ఎమ్మెల్యే సంకినేని వెంకటేశ్వరరావు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. అనారోగ్యంతో తుది శ్వాస విడిచిన ఆయన భౌతికకాయాన్ని గురువారం సంకినేని వెంకటేశ్వరరావు జిల్లాకు చెందిన నాయకులతో కలిసి సందర్శించి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా గుండా సత్యనారాయణ కుటుంబ సభ్యులను పరామర్శించి తన సానుభూతిని తెలిపారు. ఆయన మృతి సూర్యాపేట పట్టణానికి తీరని లోటని పేర్కొన్నారు.

## బీఆర్ఎస్ కార్యాలయంలో ఆచార్య జయశంకర్ జయంతి వేడుకలు

ముద్ర ప్రతినిధి, ఖమ్మం:

తెలంగాణ సిద్ధాంతకర్త ఆచార్య కొత్తపల్లి జయశంకర్ జయంతి వేడుకలను బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం తెలంగాణ భవన్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య జయశంకర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సండ్ర వెంకట వీరయ్య మాట్లాడుతూ, మలిదశ తెలంగాణ ఉద్యమానికి ఆచార్య జయశంకర్ దిశానిర్దేశం చేసి, ప్రత్యేక రాష్ట్ర ఆకాంక్షను ప్రజల్లో బలంగా తీసుకెళ్లారని కొనియాడారు. ఆయన ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, ఉద్యమకారులు, మాజీ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## ప్రజా ఆకాంక్షలే పరమావధిగా పాలన: మంత్రి పొంగులేటి

ముద్ర ప్రతినిధి, ఖమ్మం, ఆగస్టు 6:

ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేయడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. కూసుమంచి మండలంలో రూ.6.74 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఆయన, రాష్ట్రంలో ప్రతి రేషన్ కార్డుదారునికి ఉచిత సన్నబియ్యం, ఇందిరమ్మ ఇళ్ల మంజూరు, రైతు భరోసా, సన్న వడ్లకు క్వింటాలుకు రూ.500 బోనస్ వంటి పథకాలను ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. అనంతరం లింగారం తండాలో రైతులతో కలిసి పొలంలోకి దిగి వ్యవసాయ పరిస్థితులను తెలుసుకున్నారు.






ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి, పంచాయతీరాజ్ ఎస్ఈ వెంకట్‌రెడ్డి, డీవైఎస్‌వో సునీల్‌రెడ్డి, ఆర్అండ్‌బీ అధికారులు, ఆర్డీవో శ్రీనివాస్, తహసీల్దార్ సైదులు, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

### పేదలకు సన్నబియ్యం పంపిణీ ప్రారంభించిన మంత్రి

ఈశ్వర మాదారం గ్రామంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మూడు నెలల ఉచిత సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. రాష్ట్రంలో ప్రతి లబ్ధిదారుడికి నెలకు 6 కిలోల చొప్పున నాణ్యమైన సన్నబియ్యం ఉచితంగా అందిస్తున్నామని తెలిపారు.

ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా ఉచిత సన్నబియ్యం అందిస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణేనని, పేదల ఆహార భద్రతకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస్ రెడ్డి, జిల్లా పౌరసరఫరాల అధికారి చందన్ కుమార్, పంచాయతీ రాజ్ ఎస్ఈ వెంకట్ రెడ్డి, ఆర్డీఓ శ్రీనివాస్, తహసీల్దార్ సైదులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## ప్రొఫెసర్ జయశంకర్ ఆశయాలు నేటి తరానికి స్ఫూర్తి

**- జిల్లా ఎస్పీ నరసింహ**

ముద్ర, సూర్యాపేట, ఆగస్టు 6:

తెలంగాణ సిద్ధాంతకర్త, ఉద్యమ స్ఫూర్తిప్రదాత ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ సార్ జయంతిని పురస్కరించుకుని గురువారం సూర్యాపేట జిల్లా పోలీస్ కార్యాలయంలో ఘనంగా జయంతి వేడుకలు నిర్వహించారు.

ఈ సందర్భంగా ఎస్పీ నరసింహ ఐపీఎస్ ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ, ప్రొఫెసర్ జయశంకర్ ఆశయాలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. తెలంగాణ ప్రాంత ప్రజల హక్కులు, అభివృద్ధి, ఆత్మగౌరవం కోసం ఆయన జీవితాంతం కృషి చేశారని కొనియాడారు.




ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ రవీందర్ రెడ్డి, డీసీఆర్‌బీ డీఎస్పీ రవి, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ రామారావు, డీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ మగ్దుం అలీ, ఆర్ఐ జానయ్య, ఆర్ఎస్ఐలు సురేష్, రాజశేఖర్, సాయిరాం, అన్వర్, అశోక్, సీసీ సందీప్‌తో పాటు పోలీసు సిబ్బంది పాల్గొని ప్రొఫెసర్ జయశంకర్‌కు ఘనంగా నివాళులర్పించారు.

### ప్రొ. జయశంకర్ ఆశయాలను భావితరాలకు చాటాలి

**- జిల్లా రెవిన్యూ అదనపు కలెక్టర్ వెంకారెడ్డి**

ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి:

ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ ఆశయాలను భావితరాలకు చాటాలని జిల్లా రెవిన్యూ అదనపు కలెక్టర్ వెంకారెడ్డి అన్నారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ జయంతి సందర్భంగా జిల్లా రెవిన్యూ అదనపు కలెక్టర్ వెంకా రెడ్డి ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ చిత్రపటానికి జ్యోతి ప్రజ్వలన గావించి, పూలమాలలు సమర్పించి, ఘనంగా నివాళులర్పించారు.




ఈ కార్యక్రమంలో అడ్మినిస్ట్రేషన్ అధికారి అంజి రెడ్డి, జిల్లా అధికారులు,సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## ఖమ్మంలో బీఆర్ఎస్ ధర్నా.. కాంగ్రెస్ పాలనపై విమర్శలు

ముద్ర ప్రతినిధి, ఖమ్మం, ఆగస్టు 6:

నగరంలోని ప్రజా సమస్యలను పరిష్కరించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని ఆరోపిస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఖమ్మంలో భారీ ప్రదర్శన, ధర్నా నిర్వహించారు. అనంతరం మున్సిపల్ డిప్యూటీ కమిషనర్‌కు వినతిపత్రం సమర్పించారు.



ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ నగరంలో పారిశుద్ధ్యం, రహదారులు, వీధి దీపాలు, పార్కుల నిర్వహణ పూర్తిగా నిర్లక్ష్యానికి గురయ్యాయని ఆరోపించారు. ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులు, నీటి కనెక్షన్లు, ఇంటి పన్నులు, డీజిల్ వినియోగం, పబ్లిక్ టాయిలెట్లకు అనుబంధంగా షాపుల కేటాయింపుల్లో జరిగినట్లు ఆరోపణలు వస్తున్న అవకతవకలపై స్వతంత్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమస్యలను పరిష్కరించకపోతే ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో మాజీ సుడా చైర్మన్ బచ్చు విజయ్ కుమార్, మాజీ నగర పార్టీ అధ్యక్షుడు పగడాల నాగరాజు, మాజీ మార్కెట్ చైర్మన్ ఆర్ జె సి కృష్ణ, మాజీ జిల్లా గ్రంథాలయ చైర్మన్ ఖమర్, మాజీ మున్సిపాలిటీ ఫ్లోర్ లీడర్ కర్ణాటక కృష్ణ, మాజీ డిప్యూటీ మేయర్ బత్తుల మురళి మాజీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ మబ్బుల్, మాజీ కార్పొరేటర్లు బిక్కసాని ప్రశాంతలక్ష్మి , పల్లా రోషిలిని, శీలంశెట్టి వీరభద్రం, తోట రామారావు, మాటేటి నాగేశ్వరరావు, కూరాకుల వల్లరాజు, పార్టీ నాయకులు తాజుద్దీన్, గొల్లపూడి రాంప్రసాద్, దేవభక్తిని కిషోర్, జస్వంత్, సద్దాం షేక్, మాటేటి కిరణ్, మోరంపూడి సాయి, వీరభద్రం, షకీన, ఉస్మాన్, వీరేందర్, అశోక్, సాజిద్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేయాలి

**- ఎమ్మెల్యే బాలు నాయక్**

ముద్ర, దేవరకొండ, ఆగస్టు 6:

ప్రభుత్వ అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రజల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ అన్నారు. నేరేడుగొమ్ము మండల కేంద్రంలోని రైతు వేదికలో నిర్వహించిన మండల స్థాయి జనరల్ బాడీ సమావేశంలో ఆయన పాల్గొని అధికారులతో సమీక్ష నిర్వహించారు.

సమావేశానికి ముందు ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ జయంతి సందర్భం గా ఆయన చిత్రపటానికి ఎమ్మెల్యే, అధికారులు, ప్రజాప్రతినిధులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మండల అభివృద్ధి పనులు, ప్రజలకు అందుతున్న సేవలు, గ్రామాల్లోని సమస్యలపై శాఖల వారీగా సమీక్షించారు.

నేరేడుగొమ్ము మండలాన్ని ఆదర్శ మండలంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే తెలిపారు. రూ.15 కోట్ల వ్యయంతో నాలుగు ఎకరాల్లో ఇంటిగ్రేటెడ్ మండల కార్యాలయాల సముదాయం నిర్మించనున్నట్లు వెల్లడించారు. ప్రతి గ్రామంలో తాగునీటి సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో మండల ప్రత్యేక అధికారి, ఎంపీడీఓ, వివిధ శాఖల అధికారులు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.ఈ సమావేశంలో మండల ప్రత్యేక అధికారి, ఎంపీడీఓ, అన్ని శాఖల మండల అధికారులు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.




## బీఆర్ఎస్ ఆధ్వర్యంలో జయశంకర్ జయంతి

ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి:

బీఆర్ఎస్ పట్టణ శాఖ ఆధ్వర్యంలో ఆచార్య జయశంకర్ సార్ జయంతిని పురస్కరించుకొని సార్ చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులు అర్పించారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు జిల్లా అమరేందర్ గౌడ్, కొలుపుల అమరేందర్, పట్టణ అధ్యక్షులు ఏవి కిరణ్, జనరల్ సెక్రెటరీ శ్రీనివాస్, మండల అధ్యక్షుడు జనగాం పాండు, కౌన్సిలర్ నాగు, సూర్య పెల్లి రమేష్ కార్యకర్తలు పాల్గొన్నారు.



## నిరుద్యోగి వేణుకు ఎంపీ వద్దిరాజు రూ.లక్ష సాయం

ముద్ర ప్రతినిధి, ఖమ్మం :

ఉద్యోగ నోటిఫికేషన్లు జారీ చేయకపోవడంతో మానసిక ఆందోళనకు గురై ఆత్మహత్యా యత్నం చేసిన గడ్డం వేణు కుమార్ గౌడ్ కు బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ నాయకులు వద్దిరాజు రవిచంద్ర లక్ష రూపాయల ఆర్థికసాయం చేశారు.నోటిఫికేషన్ల కోసం ఎదురు చూసి,అవి విడుదల కాకపోవడంతో తీవ్ర నిరాశా నిస్పృహలకు లోనై ఆత్మహత్యకు యత్నించి ఆస్పత్రి పాలయ్యారు. వేణు కోలుకుని ఇంటికి చేరుకున్నారు. పార్లమెంట్ సమావేశాల సందర్భంగా ఢిల్లీలో ఉన్న రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్రకు వేణు ఉదంతం గురించి తెలిసి తీవ్ర విచారం ప్రకటించారు. వేణుకు తన వంతు సాయంగా ఎంపీ రవిచంద్ర జడ్పీ మాజీ ఛైర్మన్ లింగాల కమల్ రాజ్ ద్వారా లక్ష రూపాయలు పంపించారు. ఈ సందర్భంగా ఎంపీ రవిచంద్ర పంపిన లక్ష రూపాయల నగదును వేణుకు అందజేసారు.

## ఘోర రోడ్డు ప్రమాదం తల్లి, కొడుకు మృతి

ముద్ర ప్రతినిధి, ఖమ్మం:

ఖమ్మం – దేవరపల్లి గ్రీన్ ఫీల్డ్ హైవేపై ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. కారును డీసీఎం వ్యాన్ ఢీకొట్టడంతో కారులో ప్రయాణిస్తున్న తల్లీ కొడుకు అక్కడికక్కడే మృతి చెందారు. మృతులు చింతకాని మండలం గాంధీనగర్ కు చెందిన పోకబత్తిని నర్సింహారావు, సుజాతలుగా గుర్తించారు.

కారు డ్రైవర్ కు తీవ్ర గాయాలు కావడంతో ఖమ్మం ఆసుపత్రికి తరలించారు. తల్లీ కొడుకు మృతి చెందడంతో గాంధీనగర్ లో విషాద ఛాయలు అలముకున్నాయి.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
శుక్రవారం 07.08.2026
www.mudranews.in | @mudranews



### రోజు 15 నిమిషాలు ఒకే పనిపై ఏకాగ్రత

ఎలాంటి అంతరాయం లేకుండా కనీసం 15 నిమిషాలు ఒకే పనిపై పూర్తిగా దృష్టి పెట్టడం అలవాటు చేసుకోవాలి. ఇది పనితీరును మెరుగుపరచడంతో పాటు సహజమైన ఆనందాన్ని కూడా అందిస్తుంది.



## ఆచార్య, జయశంకర్ కు కలెక్టర్, ఎస్పీ నివాళులు





**ముద్ర ప్రతినిధి, మెదక్:** తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ జయంతి సందర్భంగా కలెక్టర్ ప్రతిమా సింగ్నివాళులు అర్పించారు. పెద్దశంకరంపేట్ తహసిల్దార్ కార్యాలయంలో ఆచార్య జయశంకర్ చిత్ర పటానికి పూలమాల వేశారు. తెలంగాణ ఉద్యమానికి తన జీవితాన్ని అంకితం చేసిన ఆచార్య కొత్తపల్లి జయశంకర్ అందరికి ఆదర్శప్రాయులు అన్నారు. తహసిల్దార్ నారాయణ, ఎంపీడీవో క్రాంతి కుమార్, ఆర్ఐ నాగరాజు రెవిన్యూ సిబ్బంది ఉన్నారు. మెదక్ కలెక్టరేట్ ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ సార్ చిత్రపటానికి జిల్లా రెవెన్యూ అధికారి అంబదాస్ రాజేశ్వర్ నివాళులు అర్పించారు. జడ్పీ సీఈఓ ఎల్లయ్య, డిఆర్డిఓ శ్రీనివాసరావు, జిల్లా వెనుకబడిన తరగతుల శాఖ అధికారి ఉపేందర్ పాల్గొన్నారు.

**ఎస్పీ. డి.వి శ్రీనివాస రావు నివాళులు**

తెలంగాణ సిద్ధాంతకర్త, ఉద్యమ స్ఫూర్తిప్రదాత ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ సార్ జయంతిని పురస్కరించుకుని మెదక్ జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎస్పీ డి.వి. శ్రీనివాస రావు, ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్, సీఐలు సందీప్ రెడ్డి, జార్జ్, ఆర్ఐ శైలేందర్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

**ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో...**

మెదక్ ఎమ్మెల్యే కార్యాలయంలో ప్రొఫెసర్ జయశంకర్ సార్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రజా యుద్ధ నౌక గద్దర్ వర్ధింతి సందర్భంగా నివాళులు అర్పించారు. మున్సిపల్ చైర్మన్ కానుగు రాధిక భూపతి రాజు, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మందుగుల గంగాధర్ మాట్లాడుతూ తెలంగాణ ప్రజల ఆకాంక్షలను ప్రపంచానికి చాటి చెప్పడంలో ఉద్యమానికి ర్దేశం చేయడంలో ఆయన చేసిన కృషి చిరస్మరణీయమైనది గొప్ప విద్యావేత్త, మేధావి, ఉద్యమకారుడిగా గొప్ప వ్యక్తి ప్రొఫెసర్ జయశంకర్ సార్ అని కొనియాడారు. మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ రాగి అశోక్, కౌన్సిలర్లు ఆవారి రాజశేఖర్, భుజరంపేట అరుణ సిద్ధరాములు, కో ఆప్షన్ సభ్యురాలు అనూష, మెదక్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మార్గం నాగరాజు, మాజీ కోఆప్షన్ సభ్యులు సయ్యద్ ఉమర్, కాంగ్రెస్ నాయకులు గాడి రమేష్, చెదల నవీన్, సంఘ శ్రీకాంత్, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు శ్రీను, చెప్పాల సంజీవ్, సిద్ధ రాములు తదితరులు పాల్గొన్నారు.

**బీఆర్ఎస్ భవన్ లో...**

తెలంగాణ ఉద్యమానికి సిద్ధాంత బలాన్ని అందించి, రాష్ట్ర సాధనకు జీవితాంతం అంకితభావంతో కృషి చేసిన ప్రొఫెసర్ ఆచార్య కొత్తపల్లి జయశంకర్ సార్ ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆచరణలో పెట్టాలని మాజీ మున్సిపల్ చైర్మన్ లు ఆరేళ్ల మల్లికార్జున్ గౌడ్, బట్టి జగపతి పిలుపు నిచ్చారు. మెదక్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పట్టణ పార్టీ కన్వీనర్ మామిళ్ల ఆంజనేయులు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కృష్ణారెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్లు దీపక్, జుబేర్, అహ్మద్, నాయకులు కృష్ణ గౌడ్, ప్రభురెడ్డి, కేవల్ జగదీష్, మోచి కిషన్, సాదిక్, ఇందాద్, లక్ష్మణ్ ఇస్మాయిల్, సాయి, కిరణ్,శీను నాయక్, రంజిత్ నాయక్, ఎంబిపూర్ మహేష్,రవి, వేణు తదితరులు పాల్గొన్నారు.

**విశ్వకర్మ జెఏసి ఆధ్వర్యంలో...**

విశ్వకర్మ ఎంప్లాయిస్ సొసైటీ ఆధ్వర్యంలో ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కోర్టు రోడ్డు సర్కిల్ లో విగ్రహం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. సొసైటీ సభ్యులు లక్ష్మీనాచారి, సంగయ్య చారి, యాదగిరి చారి, సత్యనారాయణ చారి, నవీన్ కుమార్ చారి, ప్రవీణ్ చారి, సాయిలు చారి, మహేష్ చారి, ప్రణవ్చారి, వీర్ కుమార్ చారి, ఇందుకుమార్ చారి, టీయూడబ్ల్యూజె జిల్లా అధ్యక్షులు శంకర్ దయాళ్ చారి, ప్రెస్ క్లబ్ అధ్యక్షులు నర్సింహా చారి, శ్రీనివాస్ చారి, రాఘవులు తదితరులు పాల్గొన్నారు.

## గర్భిణీ, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలి

**- జిల్లా సంక్షేమ అధికారిని శారద**



**ముద్ర ప్రతినిధి,సిద్దిపేట:** గర్భిణీ, బాలింతలు అంగన్వాడి కేంద్రాల ద్వారా అందించే పౌష్టిక ఆహారం తీసుకోవాలని సిద్దిపేట జిల్లా సంక్షేమ అధికారి శారద సూచించారు. గురువారం సిద్దిపేట పట్టణం లోని గాంధీనగర్ అంగన్వాడి కేంద్రంలో నిర్వహించిన తల్లిపాల వారోత్సవాలలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి డా. ధనరాజ్, ఐసిడిఎస్ సూపర్వైజర్ స్వప్న, అంగన్వాడీ టీచర్లు వినోద, నాగలక్ష్మి, శాంత, జ్యోతి, యమున, అరుణ, ఏఎన్ఎం స్వర్ణ, తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల భవిష్యత్తుతో కాంగ్రెస్ ప్రభుత్వం చెలగాటం

**బిజెపి జిల్లా అధ్యక్షుడు బైరి శంకర్ ముదిరాజ్**



**ముద్ర ప్రతినిధి, సిద్దిపేట :** కాంగ్రెస్ ప్రభుత్వం ఫీజు రీయింబర్స్మెంట్,స్కాలర్షిప్ నిధులను విడుదల చేయకుండా లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం ఆడుతుందని బిజెపి సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు బైరి శంకర్ ముదిరాజ్ మండిపడ్డారు. గురువారం జిల్లా కార్యాలయం లో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొన్నారు. SIR కార్యక్రమం,హర్ ఘర్ తిరంగా,ఫీజుల బకాయి—బీజేపీ లడాయి ఉద్యమాల నిర్వహణపై విస్తృతంగా చర్చించి, కార్యాచరణ ప్రణాళిక రూపొందించి పార్టీ నాయకులకు దిశా నిర్దేశం చేశారు. రాష్ట్రంలో సుమారు 40 లక్షల మంది విద్యార్థులకు అందాల్సిన రూ.15,000 కోట్ల ఫీజు రీయింబర్స్మెంట్,స్కాలర్షిప్ బకాయిలు ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.బకాయిల విడుదల ఆలస్యం కావడం వల్ల కళాశాలల యాజమాన్యం సర్టిఫికెట్లు ఇవ్వకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్న ప్రభుత్వం పట్టించుకోకపోవడంలో ఆంతర్యం ఏమిటని జిల్లా అధ్యక్షుడు శంకర్ ప్రశ్నించారు.

**అధ్యక్షుని మార్పు ప్రచారం అవాస్తవం**
**రాష్ట్ర అధికార ప్రతినిధి కప్పర ప్రసాద్**

సమావేశంలో పాల్గొన్న బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి కప్పర ప్రసాద్ మాట్లాడుతూ.. జిల్లా అధ్యక్షుడి మార్పుపై వస్తున్న పుకార్లు అవాస్తవం అన్నారు.రాష్ట్ర నాయకత్వంతో మాట్లాడిన తర్వాతనే అధ్యక్షుడు మారుపై స్పష్టత ఇస్తున్నానన్నారు.బైరి శంకర్ ముదిరాజ్ జిల్లా అధ్యక్షుడిగా పదవిలో కొనసాగుతారని స్పష్టం చేశారు.పార్టీ బలోపేతానికి నాయకులు,కార్యకర్తలు సమిష్టిగా పనిచేయాలని సూచించారు.బిజెపి నాయకులు అంబటి బాలేష్ గౌడ్,విభీషన్ రెడ్డి,నత్తి మల్లేశం,వెంకట్ రెడ్డి,గాడిపల్లి భాస్కర్, ఉమా రెడ్డి,జిల్లా పదాధికారులు, మోర్చా అధ్యక్షులు, మండల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

## మారిన సిలబస్‌పై అధ్యాపకులు పూర్తిస్థాయిలో అవగాహన పెంచుకోవాలి

*** స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రెండ్రోజుల శిక్షణ ప్రారంభం**
*** ఉత్తమ ఫలితాల సాధనకు ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి**
**జిల్లా ఇంటర్ విద్యాధికారి రవీందర్ రెడ్డి**

**ముద్ర ప్రతినిధి,సిద్దిపేట :** ఇంటర్మీడియట్ విద్యలో అమలవుతున్న మారిన సిలబస్, మూల్యాంకన విధానంపై అధ్యాపకులు పూర్తిస్థాయిలో అవగాహన పెంపొందించుకోవాలని జిల్లా ఇంటర్ విద్యాధికారి రవీందర్ రెడ్డి సూచించారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జూనియర్ లెక్చరర్లకు నిర్వహిస్తున్న రెండ్రోజుల శిక్షణ కార్యక్రమాన్ని గురువారం ఆయన ప్రారంభించి మాట్లాడారు.ఈ విద్యా సంవత్సరం నుంచి సైన్స్ విద్యార్థులకు 60 మార్కులు థియరీ, 15 మార్కులు ప్రాక్టికల్స్, ఆర్ట్స్ విద్యార్థులకు 20 మార్కులు ఇంటర్నల్ మూల్యాంకనం అమల్లోకి వస్తోందని తెలిపారు. మారిన విధానానికి అనుగుణంగా అధ్యాపకులు తమ బోధనా విధానాన్ని మెరుగుపరుచుకోవాలని సూచించారు.ప్రతి అధ్యాపకుడు ప్రతి పాఠంపై ముందస్తుగా సిద్ధమై తరగతి గదిలోకి వెళ్లాలని, విద్యార్థులకు సులభంగా అర్థమయ్యేలా బోధించాలని అన్నారు. మారిన సిలబస్‌పై నిర్వహిస్తున్న వర్క్‌షాప్‌ను పూర్తిస్థాయిలో వినియోగించుకుని బోధనా నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు.

విద్యా నాణ్యత పెంపొందించేందుకు ప్రభుత్వం అవసరమైన అన్ని అవకాశాలు కల్పిస్తోందని, వాటిని సమర్థంగా వినియోగించుకొని ఉత్తమ ఫలితాలు సాధించేలా ప్రతి అధ్యాపకుడు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కళాశాల ఇంచార్జ్ ప్రిన్సిపల్ జ్యోతి, మాస్టర్ ట్రైనర్ విజయలక్ష్మి, రిసోర్స్ పర్సన్ లు దేవయ్య, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే నిధులతో రోడ్లు వేయమని మీరే చెప్పండి

**- సిద్ధిపేట కాంగ్రెస్ పార్టీ పట్టణం అధ్యక్షుడు అత్తు ఇమామ్**



**ముద్ర ప్రతినిధి,సిద్ధిపేట:** సిద్ధిపేటలో వర్షం పడి రోడ్డు మీద కొంత బురద ఉంటే దాంట్లో కొందరు బిఆరెస్ నాయకులు వరి నాట్లు వేసి మీ ఎమెల్యే హరీష్ రావు పరువు తీశారని సిద్ధిపేట కాంగ్రెస్ పార్టీ పట్టణం అధ్యక్షుడు అత్తు ఇమామ్ అన్నారు. సిద్ధిపేటలో జరిగిన సమావేశంలో సిద్ధిపేట మాట్లాడుతూ నియోజకవర్గం అభివృద్ధి కోసం ఎమ్మెల్యే నిధులు ఉంటాయని సిద్ధిపేట ఎమ్మెల్యే హరీష్ రావు కు కూడా నిధులు ఉన్నాయన్నారు. ఎమ్మెల్యే నిధులు విడుదల చేసి సిద్ధిపేట నియోజకవర్గంలో పాడు అయిన చోట రోడ్లు వేయాలన్నారు. ప్రతిరోజు ఏదో సాకుతో కాంగ్రెస్ ప్రభుత్వంను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని బిఆరెస్ నాయకులు తిట్టడమే పనిగా పెట్టుకున్నారన్నారు. అధికారం పోయినక బిఆరెస్ నాయకులకు మతి భ్రమించి మాట్లాడుతున్నారని ప్రజల కోసం కేటాయించిన ఎమ్మెల్యే నిధులను హరీష్ రావు దేనికి ఖర్చు పెట్టారో ప్రజలకు చెప్పాలన్నారు. ఎమ్మెల్యే హరీష్ రావు క్షుద్రపూజలు చేశారు అని పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ అంటే ఎమ్మెల్యే హరీష్ రావు బిఆరెస్ నాయకులు ఎందుకు సమాధానం చెప్పడం లేదని అన్నారు. క్షుద్ర పూజలు చేశారా లేదా అనేది ప్రజలకు త్వరలోనే నిజం నిజాలు తెలుస్తాయి అని అన్నారు. అధికారం కోసం ఎన్ని కుట్రలు చేసిన మళ్లీ బిఆరెస్ అధికారంలోకి రాలేదని కాళేశ్వరం ప్రాజెక్టు పేరిట దోచుకున్న కల్వకుంట్ల కుటుంబం రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను నాశనం చేశారన్నారు. 10 సంవత్సరాలు తెలంగాణ ప్రజలు నమ్మి అధికారం ఇస్తే అన్ని వర్గాల ప్రజలను బిఆర్ ఎస్ మోసం చేసిందని అన్నారు. 10 సంవత్సరాలు బిఆరెస్ పాలనలో కల్వకుంట్ల కుటుంబం తప్ప ప్రజలు ఎవరూ బాగుపడలేదు అని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో మరో 20 సంవత్సరాలు కాంగ్రెస్ ప్రభుత్వం ఉండేలా ప్రజలు ఆశీర్వదించాలి అని అన్నారు. ప్రతి ఎన్నికల్లో కెసిఆర్ ను పామ్ హౌస్ కే పరిమితం చేయాలి అని ప్రజలు అలాంటి తీర్పు ఇవ్వాలి అని అన్నారు. త్వరలో జరిగే సిద్ధిపేట మునిసిపల్ ఎన్నికలలో కాంగ్రెస్ జెండా ఎగురవేస్తాం అని చైర్మన్ పీఠాన్ని కాంగ్రెస్ కైవసం చేసుకుంటాం అని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్యాదారి మధు గయాజుద్దీన్ అర్షద్ హుస్సేన్ విజయ డానియల్ నజ్జు బాబా తదితరులు నాయకులు పాల్గొన్నారు

## కాంగ్రెస్ ప్రభుత్వం లో రైతులకు నాణ్యమైన విద్యుత్ అందడం లేదు

*** లాగ్ బుక్ తనిఖీ చేసిన సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు**



**ముద్ర ప్రతినిధి, సిద్దిపేట :** సిద్దిపేట రూరల్ మండలం రాఘవాపూర్ సబ్ స్టేషన్ ను సిద్దిపేట ఎమ్మెల్యే హరిశ్ రావు ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా లాక్ బుక్ ను తనిఖీ చేశారు. అనంతరం మాట్లాడుతూ గతంలో 24 గంటల కరెంటు BRS హయాంలో వచ్చేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో 12 గంటల కరెంటు వస్తుంది నాణ్యత లేని విద్యుత్ ఇస్తున్నారని రాఘవపూర్ గ్రామంలోత్రీఫేస్ కరెంటు కేవలం 10 గంటల 30 నిమిషాల కరెంటు ఇస్తున్నారన్నారు. రేవంత్ రెడ్డి చెప్పినట్టు 24 గంటల కరెంటు ఇక్కడ రైతులకు ఇవ్వడం లేదన్నారు – కాళేశ్వరం ప్రాజెక్ట్ ద్వారా రంగనాయక సాగర్ మల్లన్న సాగర్ లో నీళ్లు నింపక అన్ని చెరువులు ఎండిపోతున్నాయని మండిపడ్డారు. అన్ని గ్రామాలలో త్రీఫేస్ కరెంటు ప్రొద్దున్న మాత్రమే ఇస్తున్నారు. రేవంత్ రెడ్డి రైతులకు 3 గంటల విద్యుత్ చాలు 24 గంటల కరెంటు ఎందుకు అని గతంలో అన్నాడడన్నారు

24 గంటల కరెంటు కెసిఆర్ అనవసరంగా రైతులకు ఇస్తున్నాడని ప్రతిపక్షంలో ఉన్నప్పుడు రేవంత్ రెడ్డి అన్నాడు. రేవంత్ రెడ్డి మాట్లాడిన మాటలు నిజం చేస్తున్నాడన్నారు. నాణ్యమైన 24 గంటల విద్యుత్ కోసం రైతులు సబ్ స్టేషన్ ముందు ధర్నాలు చేస్తున్నారు. రేవంత్ రెడ్డి రాష్ట్రంలో 24 గంటల కరెంటుకు మంగళం పాడారు. లాక్ బుక్ రికార్డు ప్రకారం 10గంటల 30 నిముషాలు మాత్రమే విద్యుత్తు రాష్ట్ర ప్రభుత్వం ఇస్తుందన్నారు. గతంలో కంటే డబుల్ ఫీజు 10 వేలు చేసి మెటీరియల్ ఇవ్వడం లేదన్నారు.సిద్దిపేట స్టోర్ లో ఒక్క ట్రాన్స్ ఫార్మర్ రెడీగా లేదు... జీరో ట్రాన్స్ఫార్మర్ అన్నారు.

## విద్యార్థులు తమ హక్కులతో పాటు బాధ్యతలు తెలుసుకోవాలి




**ముద్ర ప్రతినిధి, సిద్దిపేట :** భారత రాజ్యాంగం షెడ్యూల్ కులాలు (SC), షెడ్యూల్ తెగలు (ST) ప్రజల సామాజిక, ఆర్థిక, విద్యా అభివృద్ధికి ప్రత్యేక రక్షణలు కల్పించిందని 1అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి తరని తెలిపారు. సిద్దిపేట జిల్లా లీగల్ సెల్ అథరిటీ ఆధ్వర్యంలో సిద్దిపేట లోని జ్యోతిబా పూలే గురుకుల పాఠశాలలో NALSA, పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శ్రీ. K. రమేష్ బాబు, ప్రెసిడెంట్, బార్ అసోసియేషన్, సిద్దిపేట , శ్రీ. M. రవి కుమార్, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్సు కౌన్సెల్, సిద్దిపేట , శ్రీ. M. మురళి, C.1 సిద్దిపేట– 11 టౌన్ , శ్రీ సాజిద్, అసిస్టెంట్ ప్రిన్సిపాల్ , స్కూల్ సిబ్బంది విద్యార్థులు న్యాయ న్యాయ సేవాధికార సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

## జయశంకర్ విగ్రహాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే డా.రోహిత్



**ముద్ర ప్రతినిధి మెదక్:** రామాయంపేట పట్టణంలో గురువారం తెలంగాణ సిద్ధాంతకర్త ఆచార్య కొత్తపల్లి జయశంకర్ జయంతిని పురస్కరించుకొని సిద్దిపేట రోడ్డులో స్వర్ణకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆయన విగ్రహాన్ని మెదక్ ఎమ్మెల్యే డా.మైనంపల్లి రోహిత్ రావు ఆవిష్కరించారు. జయశంకర్ ఆశయ సాధనకు కృషి చేయాలన్నారు. అనంతరం సిద్దిపేట చౌరస్తాలో వివేకానంద విగ్రహం ప్రాంతం, మెదక్ చౌరస్తాలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం ప్రాంతాల్లో నూతన సర్కిళ్ల అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ పనుల్లో భాగంగా విగ్రహాల చుట్టూ ఆధునిక వాటర్ ఫౌంటెన్లు, గార్డెనింగ్, అలంకరణ లైటింగ్, సుందరీకరణ పనులు చేపట్టి పట్టణ ప్రధాన కూడళ్లను ఆకర్షణీయంగా తీర్చిదిద్దనున్నామన్నారు. స్వర్ణకార సంఘం జిల్లా అధ్యక్షులు పూన రవి, ప్రధాన కార్యదర్శి సుంకోజు దామోదర్ మాట్లాడుతూ... తెలంగాణ ఉద్యమానికి జీవితాన్నే అంకితం చేసిన మహనీయుడు ప్రొఫెసర్ జయశంకర్ అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్పర్సన్ గజవాడ లావణ్య నాగరాజు గుప్తా, మెదక్ జిల్లా బీసీ సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షులు మెట్టు గంగారం, మున్సిపల్ కమిషనర్ రవీందర్, కౌన్సిలర్లు దేవుని రంజిత్, పుట్టి సందీప్, రవి నాయక్, కో ఆప్షన్స్ సభ్యుడు దేమే యాదగిరి, చింతల రాధా భవాని,

**మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బండారి**

మహేందర్ రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సరాఫ్ యాదగిరి, పట్టణ అధ్యక్షులు పచ్చుంటి రాము, స్వర్ణకార సంఘం మెదక్ పట్టణ అధ్యక్షులు ఏలేశ్వరం బ్రహ్మచారి, వేణు చారి, మెదక్ జిల్లా టీయూడబ్ల్యూజే (ఐజేయు) అధ్యక్షులు శంకర్ దయాల్ చారి, పట్టణ స్వర్ణకార సంఘం అధ్యక్షులు రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి సరాఫ్ ప్రశాంత్, కోశాధికారి మైలారం వేణు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు చింతల స్వామి, డాకి స్వామి, శ్రీధర్ రెడ్డి, స్వర్ణకార సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

## భూభారతి పెండింగ్ దరఖాస్తులపై దృష్టి సారించాలి

**- కలెక్టర్ ప్రతిమాసింగ్**



**ముద్ర ప్రతినిధి, మెదక్:** భూభారతి పెండింగ్ దరఖాస్తుల పై దృష్టి సారించాలని కలెక్టర్ ప్రతిమా సింగ్ అధికారులను ఆదేశించారు. గురువారం పెద్దశంకరంపేట మండలంలో విస్తృతంగా పర్యటించి మొదటిగా తహసిల్దార్ కార్యాలయంలో భూభారతి పెండింగ్ దరఖాస్తులపై చర్చించారు. భూ భారతి, రెవిన్యూ సదస్సులో వచ్చిన దరఖాస్తుల పరిష్కారానికి చేపడుతున్న చర్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలన్నారు. మీ సేవలో వచ్చిన దరఖాస్తులను పెండింగ్ లేకుండా చూడాలన్నారు. భూ భారతి దరఖాస్తుల పరిశీలన ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. అనంతరం కేజీబీవీ సందర్శించి పాఠశాలలోని వంటశాల, తాగునీటి సౌకర్యాలు, తరగతి గదులు, మరుగుదొడ్లు, పరిశుభ్రత తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. విద్యార్థినులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేసి, ఆహార నాణ్యత, పరిశుభ్రత ప్రమాణాలపై ఆరా తీశారు.అనంతరం విద్యార్థినులతో ఆత్మీయంగా మాట్లాడిన కలెక్టర్ వారికి అందుతున్న విద్య, వసతి, ఆహారం, తాగునీరు, ఇతర మౌలిక సదుపాయాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థినులకు నాణ్యమైన విద్యతో పాటు ఆరోగ్యకరమైన, పరిశుభ్రమైన వాతావరణాన్ని కల్పించేందుకు అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు.

బుజ్రాన్ పల్లిలో గ్రామపంచాయతీ ఆవరణలో మొక్కలు నాటారు. నూతనంగా నిర్మించుకున్న ఇందిరమ్మ ఇంటి వద్ద ఇంకుడు గుంతకు గ్రామ సర్పంచ్, ఎంపీడీవో, తహసిల్దార్ తో కలిసి పరిశీలించారు. వెంట తహసిల్దార్ నారాయణ, ఎంపీడీవో క్రాంతి కుమార్, కస్తూరిబా గాంధీ విద్యాలయం ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

Printed, Published and owned by Aliminati Indra Reddy Printed at M/s. Kakatiya Printers, 2-24-96/6, Plot No. 26 & 27, L. N. Colony, New IDA, Uppal, Hyderabad 500039, Medchal Malkajgiri Dist., Telangana and Published from H. No. 7-32/B, Flat No. 202, Sri Sai Heights, Sri Sai Nagar, Street No. 8, Hasbiguda, Medchal Malkajgiri District, Hyderabad 500007, Editor: Y Narender Reddy, RNL Reg. No. TELTEL/2013/50413. e mail: mudradaily@gmail.com, Cell 9949193555